WANTED REPORTERS
నవతరం
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ కావాలన్న
కోరిక ఉందా...
ఐతే **నవతరం** మీ కోసం
అద్భుతమైన అవకాశం కల్పిస్తుంది.
వివరాలకు : 9618907705
navataramtelugudaily@gmail.com

# నవతరం


తెలుగు దినపత్రిక

ప్రచురణ కేంద్రం: హైదరాబాద్ , రాజమండ్రి సంపుటి : 12 సంచిక : 277 గురువారం 05-2-2026 పేజీలు : 8 వెల : 5-00

## ఐదు నిముషాలకే లోక్‌సభ వాయిదా

నరవణె పుస్తకంపై భయపడుతున్న ప్రభుత్వం

కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ విమర్శలు



మిగతా 2లో

## స్పీకర్ తీరు రాజ్యాంగానికే గొడ్డలి పెట్టు

కళ్లముందు కనిపిస్తున్నా సాక్ష్యాలు లేవంటే ఎలా

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు క్లీన్‌చిట్‌పై కెటిఆర్



2లో



# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌నే గెలిపించండి



మిగతా 2లో

- రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం
- మిర్యాలగూడ ప్రచారంలో సిఎం రేవంత్ రెడ్డి
- సన్నబియ్యం తీసుకున్న వారంతా ఓటేయాలి
- మున్సిపల్ ఎన్నికల తరవాత రైతుభరోసా
- తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్
- తెలంగాణ తల్లి మన సోనియమ్మ

మిర్యాలగూడ,ఫిబ్రవరి 4**నవతరం** రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలి. ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఎదురే లేదు.. విజయాన్ని అడ్డుకోలేరని అన్నారు. మిర్యాలగూడ మండలం గూడూరులో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన 'ప్రజా పాలన – ప్రజా విజయోత్సవ' సభలో సీఎం ప్రసంగించారు. రేషన్ కార్డుల కోసం గతంలో పదేళ్ల పాటు ఎదురుచూడాల్సిన పరిస్థితి. ప్రస్తుతం రాష్ట్రంలో 3.17 కోట్ల మందికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తున్నాం. సన్న బియ్యం వచ్చిన వారు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

## క్యాన్సర్‌పై అవగాహనే ముఖ్యం

ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి

అవగాహన కోసం షార్ట్ ఫిలిమ్స్ తీస్తా

క్యాన్సర్ దినోత్సవంలో చిరంజీవి



హైదరాబాద్,**నవతరం**

క్యాన్సర్‌పై అందరిలోనూ అవగాహన రావాలని అగ్రనటుడు మెగాస్టార్ చిరంజీవి అన్నారు. శరీరంలో వచ్చే మార్పులు గమనించాలని.. నిర్లక్ష్యం చేయకూ డదని చిరంజీవి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చిరంజీవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అం దరూ జీవనశైలిలో మార్పులు చేసుకుని ఆరో గ్యకరమైన వాటిని తినాలని చిరంజీవి అన్నారు. భవిష్యత్తులో క్యాన్సర్‌పై అవగాహన కోసం తాను షార్ట్‌ఫిల్మ్‌లు తీయడానికి కూడా సిద్ధంగా ఉన్నట్లు చిరంజీవి చెప్పారు. అది తన బాధ్యత అని అన్నారు.

మిగతా 2లో

## చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ భేటీ

తాజా రాజకీయ పరిస్థితులపై సుదీర్ఘంగా చర్చ

వైకాపా కుట్ర రాజకీయాలను తిప్పికొట్టడంపై దృష్టి



అమరావతి,**నవతరం**

ఏపీ సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ భేటీ ముగిసింది. సుమారు రెండున్నర గంటలపాటు వారిద్దరూ సమావేశమై వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న తాజా రాజకీయ పరిణామాలపై చంద్రబాబు, పవన్ మధ్య ప్రధానంగా చర్చ జరిగినట్లు సమాచారం. కుల రాజకీయాలను వైకాపా రెచ్చగొడుతోందని.. ఆ కుట్రలను ఎదుర్కొనేందుకు, ఆ పార్టీ ట్రాప్‌లో పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని నేతలిద్దరూ నిర్ణయానికి వచ్చారు. దీనికోసం అనుసరించాల్సిన

మిగతా 2లో

## పవన్ ఆంధ్రా రాజకీయాలు చూసుకో

తెలంగాణను అవమానించిన నీకు ఇక్కడేం పని

టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఘాటుగా వ్యాఖ్యలు



వివరాలు 2లో

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు క్లీన్ చిట్

- పార్టీ మారిన దాఖలాలు లేవన్న స్పీకర్ స్పీకర్ తీర్పును
- స్వాగతించిన సంజయ్ తాను బిఆర్ఎస్
- ఎమ్మెల్యేగానే ఉన్నాని వెల్లడి



2లో



## పదేండ్ల పాలనలో సిరిసిల్లకు ఒరిగిందేమీ లేదు

బీజేపీ ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

సిరిసిల్ల, నవతరం: మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిరిసిల్ల అంబేద్కర్ సర్కిల్ వద్ద నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్ లో పాల్గొన్నారు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్. కార్యక్రమంలో బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ... సిరిసిల్లలో వానొస్తే గల్లీలన్నీ మునిగే పరిస్థితి, చివరకు కలెక్టరేట్ కూడా మునిగిన దుస్థితి. వస్త్ర పరిశ్రమ మొత్తం సిరిసిల్లలో ఉంటే కమీషన్ల కోసం నూలు డిపోను వేములవాడలో పెట్టిండ్రు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సిరిసిల్లకు ఒరిగిందేమీ లేదు,

# మైక్రో ఎంట్రప్రెన్యూర్లుగా వెనుకబడిన వర్గాలు

814 బీసీ సంక్షేమ హాస్టళ్లలో రూ.17 కోట్ల వ్యయంతో మార్చిలోగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. దీంతో పాటు హాస్టళ్లలో శానిటేషన్ తో పాటు విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యా బోధన సహా అన్ని అంశాల్లోనూ బెస్ట్ ప్రాక్టీసెస్ అనుసరించాలని సూచనలు ఇచ్చారు. బీసీ విద్యార్థులకు విద్యాపరమైన అంశాల పర్యవేక్షణకు అపార్ ఐడీలను నమోదు చేసి అనుసంధానం చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న బీసీ భవనాలను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న 6 మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ స్కూళ్లను జూనియర్ కాలేజీలుగా మార్చాలని సీఎం ఆదేశించారు.

బీసీ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో నెట్ జీరో కాన్సెప్ట్ కూడా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ నియోజకవర్గంలోనూ బీసీ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో బీసీ స్టడీ సర్కిళ్లను తదుపరి స్థాయికి తీసుకెళ్లేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. వెనుకబడిన వర్గాలకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని వారికి ప్రయోజనం కలిగేలా పథకాలు రూపొందించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

## క్యాన్సర్‌పై అవగాహనే ముఖ్యం



అందరూ జాగ్రత్తగా ఉంటూ ఈ మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. గతంలో నా స్నేహితుడు ఒకరు క్యాన్సర్ బారిన పడితే వెంటనే గమనించి వైద్యం తీసుకున్నాడు. దాన్ని నివారించగలిగాం. ఇప్పుడు పదేళ్ల నుంచి హాయిగా ఉంటున్నాడు. శరీరం చెప్పే మాట అందరూ వినాలి. నాకు క్యాన్సర్ రాదులే అని నిర్లక్ష్యం చేయకూడదు. మన అలవాట్లు, వాతావరణం, వంశపారంపర్యంగా కూడా క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది.

మొదటి దశలోనే దాన్ని గుర్తిస్తే 90 శాతం తగ్గించుకునే అవకాశాలు ఉన్నాయి. అమ్మాయిలకు చిన్న వయసులోనే వ్యాక్సిన్‌లు వేయిస్తే కొన్నిరకాల క్యాన్సర్ల బారిన పడకుండా కాపాడొచ్చు. మహిళలు కూడా జాగ్రత్తగా ఉండాలి. వ్యాక్సిన్‌లు తీసుకోవాలి.

## చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ భేటీ



వ్యూహంపై చర్చించారు. కిందిస్థాయిలో తెదేపా, జనసేన క్యాడర్ మధ్య చిచ్చుపెట్టేలా వైకాపా చేస్తున్న కుట్రలకు చెక్ పెట్టేలా పలు నిర్ణయాలు తీసుకున్నట్లు సమాచారం. త్వరలో ఖాళీ కానున్న 4 రాజ్యసభ స్థానాలపైనా చంద్రబాబు, పవన్ ప్రాథమికంగా చర్చించినట్లు తెలుస్తోంది. పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీపైనా సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. బుధవారం ఉదయం సీఎం నివాసానికి చేరుకున్నాక ఇద్దరి మధ్య సమావేశం మొదలైంది. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, సున్నితమైన అంశాలపై విపక్షం రెచ్చగొట్టే ప్రయత్నాలు, తదితర అంశాలపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. అలాగే రాజ్యసభ ఎన్నికలు, నియామక పదవులు, కూటమి పక్షాల సమన్వయం, వైసీపీ విషప్రచారాన్ని తిప్పికొట్టడంపై చర్చించనున్నట్లు సమాచారం. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వ్యవహారంపై ఈ సమావేశంలో చర్చ జరుగనున్నట్లు తెలుస్తోంది. తిరుమలకు ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఉన్న నేపథ్యంలో.. వారి మనోభావాలను గౌరవించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ఎన్‌డీడీబీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే గతంలో సీఎం మాట్లాడటం, విచారణకు ఆదేశించడం,

అలాగే ఈ అంశంపై సుప్రీం కోర్టుకు పలువురు వెళ్లగా సీబీఐ నేతృత్వంలో సిట్ ఏర్పాటై ఈ వ్యవహారంపై విచారించడం జరిగింది. నెయ్యి కల్తీ జరగడం వాస్తవమని తేలడంతో.. ఇందులో ఎవరు సూత్రధారులు అనేదానిపై కేబినెట్‌లో చర్చించడంతో పాటూ కల్తీకి ఆస్కారం ఇచ్చిన వారంతా బాధ్యులే అని సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం.

## జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కు క్లీన్ చిట్

హైదరాబాద్,ఫిబ్రవరి 4 జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ క్లీన్‌చిట్ ఇచ్చారు. సంజయ్ పార్టీ మారినట్లు ఆధారాలు లేవని, ఆయన్ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే పరిగణిస్తున్నామని స్పీకర్ తీర్పు ఇచ్చారు. దీనికి సంబంధించిన గెజిట్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. సంజయ్‌పై అనర్హత కోరుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఇక, పార్టీ ఫిరాయిపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది ఎమ్మెల్యేలలో ఇప్పటికే ఏడుగురికి స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చిన విషయం తెలిసిందే. సంజయ్ సహా ఎనిమిది మంది ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన స్పీకర్.. కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై దాఖలైన పిటిషన్ల విచారణను ఫిబ్రవరి 19కి వాయిదా వేశారు. తాజాగా జగిత్యాల ఎమ్మెల్యేకు కూడా క్లిన్ చిట్ ఇచ్చేశారు స్పీకర్. స్పీకర్ ఇచ్చిన తీర్పుపై జగిత్యాల ఎమ్మెల్యే స్పందిస్తూ... ’నేను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేనే. బీఆర్ఎస్ పార్టీలోనే గెలిచా. బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని అఫిడవిట్ ఇచ్చా. అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ బిల్లులు ప్రవేశపెట్టి, విప్ జారీ చేస్తే నేను మద్దతు ఇస్తా. నేనెప్పుడూ బీఆర్ఎస్ పార్టీని, అధిష్టానాన్ని విమర్శించలేదు. స్థానిక బీఆర్ఎస్ నాయకత్వం నాకు దూరంగా ఉంది. నాది ఎలక్షన్ కోసం కాదు.. అభివృద్ధి కోసం ఆరాటం. జగిత్యాల అభివృద్ధి కోసం సీఎం, ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నా’ అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. నా జీతం నుంచి నెలకు రూ. 5 వేలు బీఆర్ఎస్ పార్టీకి కట్ అవుతున్నాయి.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌నే గెలిపించండి

(మొదటి పేజి (తరువాయి)



రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ప్రజలు కాంగ్రెస్‌కే ఓటు వేయాలని పిలుపు నిచ్చారు. వరి ఉత్పత్తిలో మిర్యాలగూడ ఆసియాలోనే ముందుంది. మిర్యాలగూడ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ బీఫాం మీద పోటీ చేస్తున్న ఆడబిడ్డలకు కూడా ఆర్టీసీలో ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించాం. సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా వివక్ష చూపలేదు. రైతు రుణమాఫీ కింద 25.35 లక్షల మందికి రూ.21 వేల కోట్లు ఖర్చు చేశాం. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం. రైతు భరోసా కింద రూ.6వేల చొప్పున రూ.9వేల కోట్లు ఇచ్చాం. మున్సిపల్ ఎన్నికలు ముగిశాక రైతు భరోసా నిధులు జమ చేస్తాం. దేశంలో అత్యధికంగా రైతుల కోసం రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేశాం. ఏప్రిల్‌లో కొత్త బ్జడెట్‌లో లక్షలాది ఇళ్లు పేదలకు ఇస్తాం. పేదల ఆత్మగౌరవం పెంచే బాధ్యత తీసుకుంటాం. నల్గొండ జిల్లాపై కోపంతో ఎస్ఎల్‌బీసీని పక్కనపెట్టారు. ఎస్ఎల్‌బీసీ ఆగిపోతే మామ, అల్లుళ్లు దావతు చేసుకున్నారు. నల్గొండ ప్రజలు ఫ్లోరైడ్ నీళ్లు తాగడానికి కారణం బీఆర్ఎస్. రెండేళ్లలో పూర్తి చేసే లక్ష్యంతో ఎస్-ఎల్‌బీసీ పనులు చేపట్టాం. కేసీఆర్‌కు పోలీసులు నోటీసు ఇస్తే.. తెలంగాణ జాతికి ఇచ్చినట్టు చెబుతున్నారని సీఎం విమర్శించారు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాలను మార్చి, అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని సీఎం విమర్శించారు. సన్నబియ్యం పొందుతున్న లబ్ధిదారులంతా కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికలు ముగిసిన వెంటనే రైతు భరోసా అందిస్తామని సీఎం హామీ ఇచ్చారు. మహిళలకు ఉచిత బస్సు పథకం నిజంగా వరంగా మారిందని, ఆర్టీసీ బస్సుల్లో టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న మహిళలు కాంగ్రెస్‌కు ఓటేస్తే.. బిఆర్ఎస్ అడ్రస్ గల్లంతు అవుతుంది అంటూ వ్యాఖ్యానించారు. అలాగే ఇతర నాయకులకు కూడా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందుతుందని, సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్ష లేదని స్పష్టం చేశారు. 10 ఏళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్‌కు పేదవాళ్లకు ఇళ్లు ఇవ్వాలనే ఆలోచన రాలేదని సీఎం విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం డిమాండ్ ఉందని, రాబోయే బడ్జెట్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భారీగా నిధులు కేటాయించి పేదల ఆత్మగౌరవాన్ని కాపాడతామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నల్లగొండ జిల్లా ప్రజలపై కోపంతో ఋూఒఃఅ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ఋూఒఃఅ ప్రమాదంలో 8 మంది మృతి చెందితే మామ?అల్లుళ్లు సంబరాలు చేసుకున్నారని ఇంట్రెస్టింగ్ వ్యాఖ్యలు చేశారు. గంజి గతి లేని నాయకులు బెంజ్ కార్లు కొనుగోలు చేశారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో మిగితా నేతలు డబ్బులు ఇస్తే తీసుకోండి, కానీ ఓటు మాత్రం కాంగ్రెస్‌కే వేయాలని పిలుపునిచ్చారు.

గత ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందని సీఎం ఆరోపిస్తూ.. జాతిపిత ఎవరన్న ప్రశ్నకు సమాధానంగా, తెలంగాణ కోసం సర్వం త్యాగం చేసిన ప్రొఫెసర్ జయశంకర్‌నే జాతిపిత అని, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీనే తెలంగాణ తల్లి అని స్పష్టం చేశారు.

## ఐదు నిముషాలకే లోక్‌సభ వాయిదా

న్యూఢిల్లీ,ఫిబ్రవరి4: పార్లమెంటు బ్జడెట్ సమావేశాల్లో యూరోపియన్ యూనియన్, అమెరికాతో చేసుకున్న ఒప్పందాల వివరాలను పార్లమెంటు ముందుంచాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో బుధవారం కూడా లోక్‌సభ ప్రారంభం అవ్వగానే ప్రతిపక్ష సభ్యులు ఈ ఒప్పందాలపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది.

ఈ పరిణామాలతో సభ ప్రారంభమైన ఐదు నిమిషాలకే మధ్యాహ్నం 12 గంటల వరకు స్పీకర్ వాయిదా వేశారు. మరోవైపు రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోడీ మాట్లాడనున్నారు. ఇకపోతే భారత సైన్యం మాజీ అధిపతి ఎం.ఎం.నరవణె పుస్తకంలోని ఓ అంశంపై వివాదం కొనసాగుతోంది. దీనిపై తాజాగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ స్పందించారు. ఆ పుస్తకం చదివితే చైనా మన సరిహద్దుల్లోకి వచ్చినప్పుడు మన దేశ నాయకత్వం దానిపై ఎలా స్పందించిందనే విషయం బయటపడిఎ౧ోతుందని ప్రభుత్వం భయపడు తోందన్నారు. అందుకే తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని ఈ విషయంపై పార్లమెంటులో మాట్లాడనీయ కుండా చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటు ప్రాంగణంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. భాజపా నాయకులు మాట్లాడేటప్పుడు కూడా పుస్తకాలు, పత్రికల గురించి ప్రస్తావిస్తార న్నారు. ఈ సందర్భంగా గతంలో ప్రభుత్వమైనా, ప్రతిపక్షమైనా తమ అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తం చేసేవి. కానీ, ఇప్పుడు ఓ వ్యక్తి అభిప్రాయాన్ని మాత్రమే ముందుకు తీసుకొస్తున్నారని విమర్శలు చేశారు. వారికి సంబంధించి ఏ విషయాలు బయటపడతాయోనని ప్రభుత్వం భయపడు తోందన్నారు. అందుకే ఆ పుస్తకం ప్రచురణకు అనుమతించడం లేదని ఆరోపించారు.

ఇంకా ప్రచురణ కాని నరవణె రాసిన పుస్తకాన్ని విపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంటు ప్రాంగణంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నేడు ప్రధాని మోదీ లోక్‌సభకు వస్తారని తాను అనుకోవడం లేదన్నారు. ఒకవేళ మోదీ వస్తే.. తానే స్వయంగా ఆయన వద్దకువెళ్లి ఈ పుస్తకాన్ని అందజేస్తానన్నారు.

## తెలుగు చిత్ర పరిశ్రమకు పెద్దపీట



కేంద్రంగా మారుతుందని వెల్లడించారు. కళల ద్వారా సమాజానికి తన జీవితాన్ని అర్పించిన మహానుభావుడు ప్రజా గాయకుడు గద్దర్ అని అన్నారు. అందుకే గద్దర్ పేరు మీద సినిమా అవార్డులను ప్రారంభించి సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకత ఆధారంగానే అవార్డులు ఇవ్వాలని జ్యూరీ సభ్యులకు సూచించారు. ఉగాది రోజు మార్చి 19న ఘనంగా అవార్డుల పంపిణీ జరగనుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఫిబ్రవరి 6 నుంచి గద్దర్ అవార్డుల స్క్రీనింగ్ పక్రియ ప్రారంభమవుతుంది. దేశవ్యాప్తంగా ఫిలిం ఇండస్ట్రీకి హైదరాబాదును కేంద్రంగా చేయాలన్న ఆలోచనతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. బాంబే, కలకత్తా, చెన్నై వంటి పట్టణాల్లో సినీ ఇండస్ట్రీ పెరగడానికి అంతగా అవకాశాలు లేవు, కానీ దేశంలో ఉన్న అన్ని భాషల ఇండస్ట్రీలను హైదరాబాద్‌లో విస్తరించడానికి సానుకూల అంశాలు అనేకం ఉన్నాయని తెలిపారు. సకల భాషల సినీ ఇండస్ట్రీ, హైదరాబాద్‌కు తరలి వస్తే రాష్ట్ర యువతకు, టెక్నీషియన్లు, రైటర్లు, డైరెక్టర్లకు ఉపాధి లభిస్తుంది. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన బ్లూ ప్రింట్ ప్రభుత్వం తయారు చేస్తుందని చెప్పారు. గత ప్రభుత్వం దశాబ్ద కాలం పాటు సినిమా రంగానికి సంబంధించిన అవార్డుల విషయంలో నిర్లక్ష్యం వహించి వదిలేస్తే, సమాజంలో అత్యంత ప్రభావం చూపే సామాజిక పరివర్తన తీసుకొచ్చే సినీ రంగాన్ని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అవార్డులు ఇచ్చి తిరిగి ప్రోత్సహించడం ప్రారంభించిందని వివరించారు.సమాజం కోసం కళల ద్వారా తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానుభావుడు గద్దర్ అని డిప్యూటీ సీఎం కొనియాడారు. తెలంగాణ అంటే కళలు, విప్లవం, ప్రశ్నించడం, సున్నిత మనసుతో, ప్రేమానురాగాలతో కూడినదని, తెలంగాణ కళలు, సంస్కృతిని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి గద్దర్ అని పేర్కొన్నారు.

ప్రతిభ, పారదర్శకతలే ప్రమాణంగా సినిమా అవార్డుల ఎంపిక ఉంటుందని, గత సంవత్సరం జ్యూరీ సభ్యులు అవార్డుల ఎంపికను గొప్పగా నిర్వహించి, అభినందనలు పొందిన విషయాన్ని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా గుర్తు చేశారు. సినిమా రంగం పట్ల వారికున్న అభిమానాన్ని దృష్టిలో పెట్టుకొని ఎఫ్ డి సి ద్వారా అందరితో సంప్రదింపులు జరిపి జ్యూరీ సభ్యులను ఎంపిక చేశారని, ప్రభుత్వ నుంచి కావలసిన సహకారాన్ని పూర్తిస్థాయిలో అందజేస్తామని తెలిపారు.

## పవన్ ఆంధ్రా రాజకీయాలు చూసుకో

హైదరాబాద్,ఫిబ్రవరి 4

పవన్ ఒక ఆంధ్ర నాయకుడని, ఆయన తెలంగాణ వ్యతిరేకి అని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఘాటుగా వ్యాఖ్యానిం చారు. ఈ మేరకు పవన్ కల్యాణ్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ తన రాజకీయాలను ఆంధ్రాలోనే చేసుకోవాలని, తెలం గాణలో ఆయన ప్రచారం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి మద్దతుగా పవన్ కల్యాణ్ ప్రచారం చేస్తారనే వార్తలు వస్తున్న నేపథ్యంలో మహేశ్ గౌడ్ ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గతంలో పవన్ తెలం గాణ గురించి చాలా నీచంగా మాట్లాడారు. బీజేపీ నేతలు పవన్ కల్యాణ్‌ను భిక్షాం దేహీ అని అడిగారు‘ అని ఆయన ఎద్దేవా చేశారు. మాట్లాడారని, అలాంటి వ్యక్తి మాటలు విని ఇక్కడి ప్రజలు ఓట్లు వేయరని అన్నారు. ఆయన ప్రభావం తెలంగాణ రాజకీయాలపై శూన్యమని మహేష్ గౌడ్ స్పష్టం చేశారు.గతంలో తెలంగాణ రాష్ట్రం గురించి, తెలంగాణ వ్యక్తుల గురించి, భాష, సంస్కృతి గురించి దారుణంగా మాట్లాడారని మండిపడ్డారు. అందుకే పవన్ ను దిష్టి కల్యాణ్ అని అంటామని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## స్పీకర్ తీరు రాజ్యాంగానికే గొడ్డలి పెట్టు

హైదరాబాద్,ఫిబ్రవరి 4:ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ వరుసగా కొట్టివేస్తున్న తీరు రాజ్యాంగానికే గొడ్డలిపెట్టని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే స్వయంగా జగిత్యాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌కి కండువా కప్పి కాంగ్రెస్‌లో చేర్చుకున్న ఫోటోలు, వీడియోలు కళ్లముందు కనిపిస్తున్నా ఆధారాలు లేవని అనర్హత పిటిషన్‌ను తిరస్కరించడం అర్థరహితం అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను స్పీకర్ కొట్టేయడంపై కేటీఆర్ స్పందించారు. చేశారు. అటు సుప్రీంకోర్టు తీర్పును, ఇటు ప్రజాతీర్పును కాలరాసి గోడదూకిన ఎమ్మెల్యేలపై రాజ్యాంగబద్ధంగా చర్య తీసుకోకుండా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నడుచుకోవడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే.

# ఉమ్మడి జిల్లాలో పురపోరులో జోరు

**బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి**

**ఎక్కడిక్కడ ప్రచారంలో నేతలు బిజీ**

నిజామాబాద్,ఫిబ్రవరి4 ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కుట్రలు, కుతంత్రాలతో ప్రతిపక్ష పార్టీ నాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి మున్సిపల్ ఎన్నికలే నాంది పలుకుతాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. పార్టీ అభ్యర్థులు ఐక్యతతో పనిచేసి ప్రజల ఆశీర్వాదంతో ఘన విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. మున్సిపల్ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ పార్టీలోకి కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి వలసలు కొనసాగుతున్నాయనిమాజీ మంత్రి అన్నారు. తెలంగాణను బీడు భూమిగా మార్చిన కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. బీఆర్ఎస్‌తోనే నగర అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజలు కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఇదిలావుంటే పురపాలక ఎన్నికలకు భారత రాష్ట్ర సమితి పక్కా వ్యూహంతో దూసుకుని పోతోంది. ఉమ్మడి జిల్లాలో పురపాలక పీఠాలను కైవసం చేసుకునేందుకు ముఖ్య నేతలంతా రంగంలోకి దిగారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎదురైన అనుభవాలను క్రోడీకరించి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మాదిరిగానే అద్భుతమైన ఫలితాలు రాబట్టేందుకు పని చేయాలని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కీలకమైన నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటుగా ఆర్మూర్, బోధన్, భీంగల్ పురపాలక పీఠాలపై గులాబీ జెండాను ఎగురవేసేందుకు నేతలంతా రంగంలోకి దిగారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తన నియోజకవర్గంలోని భీంగల్ మున్సిపాలిటీని స్వాధీనం చేసుకునేందుకు అడుగులు వేస్తున్నారు. గెలుపు గుర్రాలనే ఎంపిక చేసి బరిలోకి దింపారు. ఆర్మూర్‌లో వరుసగా గులాబీ జెండాను రెపరెపలాడించేందుకు ఆశన్నగారి జీవన్ రెడ్డి చురుగ్గా వార్డుల్లో కలియ తిరుగుతున్నారు. బోధన్‌లో షకీల్ దంపతులు విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తూ దూసుకు పోతున్నారు. నిజామాబాద్ నగరంలో మరోసారి సత్తా చాటేందుకు బిగాల గణెశ్ గుప్తా తనదైన శైలిలో వ్యూహాలను రచిస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో మొత్తం నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయి. కామారెడ్డి పురపాలక సంఘం లో వరుసగా మూడోసారి బీఆర్ఎస్ జెండాను ఎగిరేసేందుకు ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ ప్రణాళికలు రచిస్తున్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి వీజీ గౌడ్‌తో సమన్వయం చేసుకుంటూ కార్యరంగంలో దూసుకు పోతున్నారు. అన్ని వార్డుల్లో కాంగ్రెస్, బీజేపీతో బలంగా తలబడే నాయకులకు కౌన్సిలర్ టికెట్లు కేటాయించి ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మైనార్టీ ఏరియాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏర్పడిన అసంతృప్తిని అనుకూలంగా మార్చుకునేందుకు గంప గోవర్ధన్ పాటు పడుతున్నారు. ఎల్లారెడ్డిలోనూ సగానికి ఎక్కువ సీట్లు గెలిచి బీఆర్ఎస్ జెండాను మరోసారి ఎగిరేసేందుకు జాజాల సురేందర్ ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. బాన్సువాడలో పార్టీ మారిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి పురపాలక ఎన్నికల ద్వారా గట్టి సమాధానం ఇచ్చేందుకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నాయకత్వంలో బీఆర్ఎస్ శ్రేణులు బలంగా పని చేస్తున్నాయి. బిచ్కుంద మున్సిపాలిటీలో తొలిసారి ఎన్నికలు జరుగుతుండటంతో బీఆర్ఎస్ నేతలంతా కౌన్సిలర్‌గా పోటీ చేసి విజయం సాధించేందుకు భారీగా ఉత్సాహం చూపుతున్నారు. ఈ ఎన్నికలను మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే సవాల్‌గా తీసుకుని పని చేస్తున్నారు. ఈ పోరులో కారు గుర్తుతో ప్రజల్లోకి బలంగా వెళ్లి వారి మద్దతును కూడగట్టేందుకు బీఆర్ఎస్ నేతలంతా ప్రయత్నాలు మొదలు పెట్టారు.

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన రద్దు

**ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము**

**కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం**



న్యూఢిల్లీ,ఫిబ్రవరి4 మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను రద్దు చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము బుధవారంనాడు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రాజ్యాంగంలోని 356వ అధికరణలోని క్లాజ్ (2) ద్వారా తనకు సంక్రమించిన అధికారాలతో 2025 ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ జారీ చేసిన ఆదేశాలను రద్దు చేస్తున్నట్టు రాష్ట్రపతి ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2026 ఫిబ్రవరి 4వ తేదీ నుంచి తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చినట్టు తెలిపారు. జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్ అట్టుడకడంతో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ గతేడాది రాజీనామా చేశారు. దీంతో తొలుత 6 నెలలపాటు అక్కడ రాష్ట్రపతి పాలన విధించి మరోసారి దానిని పొడిగించారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు కేంద్రం చేపట్టిన సన్నాహకాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర శాసనసభా పక్ష నేతగా యుమునాం ఖేమ్‌చంద్ సింగ్‌ను ఆ పార్టీ ఎమ్మెల్యేలు మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో 62 ఏళ్ల ఖేమ్‌చంద్ మణిపూర్ కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మణిపూర్ రాజకీయాల్లో బీజేపీ కీలక నేతగా ఖేమ్‌చంద్ పేరు తెచ్చుకున్నారు. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఇంఫాల్ వెస్ట్‌లోని సింజమి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2017 మార్చి నుంచి 2022 మార్చి వరకూ మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించడంతో బీరేన్ సింగ్ ప్రభుత్వంలో రెండోసారి క్యాబినెట్ మంత్రిగా సింగ్ నియమితులయ్యారు. మున్సిపల్ పాలనా వ్యవహారాలు, హౌసింగ్ డెవలప్‌మెంట్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, విద్యా శాఖలను నిర్వహించారు. 2025 ఫిబ్రవరిలో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించేంత వరకూ ఆ పదవులను ఆయన సమర్ధవంతంగా నిర్వహించారు.

## జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కిందపడి ఇంజనీర్ మృతి

విశాఖపట్టణం,ఫిబ్రవరి4 జన్మభూమి ఎక్స్‌ప్రెస్ కిందపడి చీఫ్ ఇంజినీర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం విశాఖ జిల్లా దువ్వాడ రైల్వేస్టేషన్‌లో జరిగింది. ఓ ప్రైవేటు కంపెనీలో చీఫ్ ఇంజినీర్ గా పని చేస్తున్న హర్షవర్ధన్ (36) విజయవాడ వైపు వెళుతున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఆత్మహత్య చేసుకుంటున్నట్లుగా హర్షవర్ధన్ బుధవారం ఉదయం సూసైడ్ నోట్ రాసి బయటకు వెళ్లిపోయారు. దీంతో ఆయన అదృశ్యమైనట్లు న్యూపోర్టు పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో దువ్వాడ రైల్వేస్టేషన్లో హర్షవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. చీఫ్ ఇంజినీర్ ఆత్మహత్యకు కుటుంబ కలహాలే కారణంగా తెలుస్తోంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 15లక్షలు తీసుకుంటూ ఎసిబికి చిక్కిన జోన్ ఎస్ఇ

హైదరాబాద్,ఫిబ్రవరి4

ఏసీబీ అధికారుల వలలో భారీ అవినీతి తిమింగలం పడింది. రూ. 15 లక్షలు లంచం తీసుకుంటూ కూకట్‌పల్లి జోన్ ఎస్ఈ చిన్నారెడ్డి అధికారులకు చిక్కారు. జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో ఏసీబీ తనిఖీలు చేపట్టింది. వివిధ పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. చిన్నారెడ్డి ఆస్తులు, ఇతర అంశాలపై ఏసీబీ ఆరా తీస్తోంది. బిల్లులు మంజూరు చేయాలంటే లంచం ఇవ్వాలని ఒక కాంట్రాక్టర్‌ను డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో సదరు కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు.

## వేములవాడలో బిజెపి జెండా ఎగరేస్తాం

ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి బండి సంజయ్

పోలీసులు నిష్పక్షపాతంగా ఉండాలని హితవు



వేములవాడ,ఫిబ్రవరి 4

వేములవాడ మున్సిపాలిటీని భాజపా కైవసం చేసుకోవడం ఖాయం అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. నిధులిచ్చేది మోదీ... తెచ్చేది నేను. మరి కాంగ్రెస్, భారాసకు ఎందుకు ఓట్లేయాలి?కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా అమలు చేశారా? అని ప్రశ్నించారు. సిరిసిల్ల, వేములవాడలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో బండి సంజయ్ పాల్గొన్నారు. మహిళలకు రూ.2500, తులం బంగారం, స్కూటీ ఇచ్చారా? అవ్వాతాతలకు రూ.4 వేల పెన్షన్ ఇచ్చారా? నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశారా? నిరుద్యోగ భృతి ఇచ్చారా? పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పి చేశారు. కేంద్రం నిధులిస్తే కమీషన్లు దండుకున్నారు. మళ్లీ దొంగ హామీలతో

కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు మీ ముందుకు వస్తున్నారు. ఎందుకు ఓటేయాలంటూ ఆ రెండు పార్టీలను నిలదీయండని బండి సంజయ్ పిలుపునిచ్చారు. వేములవాడ ఎమ్మెల్యే భాజపా కార్యకర్తలను బెదిరిస్తుంటే పోలీసులు వంతపాడతారా కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పద్దతి మార్చుకోకపోతే వేములవాడలోనే కూర్చుంటా.. మీ డీజీపీ, ఎస్పీని ఇక్కడికి రప్పించాల్సి ఉంటుంది అంటూ.. సిరిసిల్ల పోలీసులను కేంద్ర మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై విరుచుకుపడ్డారు. మా రిక్వెస్ట్‌ను చేతగానితనంగా భావిస్తున్నారా? ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని లేదా అని అన్నారు. సిరిసిల్ల సీఐ క్రిష్ణ.. భాజపా నాయకులు, సిబ్బందిపై దాడి చేసి ఓవరాక్షన్ చేశారని బండి సంజయ్ మండిపడ్డారు. తక్షణమే విధుల్లోంచి తప్పించకపోతే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.

## అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ**



ఖమ్మం,ఫిబ్రవరి 4 తెలంగాణ లో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఇప్పటికే 4.5 లక్షల ఇళ్లు మంజూరు చేయగా, రెండో జాబితా పై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ కీలక ప్రకటన చేశారు. ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్నిపల్ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ.. త్వరలో రెండో విడత లబ్దిదారుల జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారందరికీ ఈ విడతలో ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. ÷ూజకీయాలను పక్కనపెట్టి పేదల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు.ప్రభుత్వం పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే.

ఖాళీ స్థలం ఉండి ఇల్లు నిర్మించే పేదలకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. మొత్తం 4 విడతల్లో లబ్దిదారుల ఖాతాల్లో ఆ మొత్తం నిధులు జమ చేస్తున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో పేదలు ఇంటి నిర్మాణ పనులు మొదలు పెట్టారు. మరికొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణాలు సైతం పూర్తయ్యాయి.

## పులి జాడలతో జనం బెంబేలు

**అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన**




జనగామ,ఫిబ్రవరి4 పెద్దపులి సంచారం ఇప్పుడు మూడు జిల్లాల వాసులను భయాం దోళనకు గురి చేస్తోంది. సిద్దిపేట, యాదాద్రి, జనగామ జిల్లాల సరిహద్దుల్లో తిరుగు తున్నట్లుగా గుర్తించారు. జనగామ మండలంలోని సిద్దెంకి, పెంబర్తి, పెద్దరాంచర్లలో పెద్దపులి సంచరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. యాద్రాది భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామ మీదుగా పెద్దపులి జనగామకు ప్రవేశించినట్లు రైతులు ఆటవీశాఖ, పోలీసులు సమాచారం అందించారు. దీంతో ఆధికారులు ఆయా గ్రామాలకు వెళ్లి పులి పాదముద్రలను సేకరించారు. వ్యవసాయ బావుల ప్రాంతాల్లో సంచరిస్తూ ఉండోచ్చని కావున వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చిన పెద్దపులి వరుస గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. తాజాగా ఈ పులి యాదాద్రి భువనగిరి(జజీటజీటసతి ఃథబీలజీనిజీణతిసతి) జిల్లా రాజపేట మండలం బసంతపూర్ సమీపంలో ఓ లేగదూడపై దాడి చేసి చంపేసినట్లు అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. పులి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు, తాజాగా జనగామ జిల్లా ఆలేరు మండలం శ్రీనివాసపురం గ్రామ పరిసరాల వైపు పులి వెళ్లినట్లు పాదముద్రల ఆధారంగా గుర్తించారు. ఘటనా స్థలాల్లో అటవీ శాఖ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. పులి ప్రయాణించే మార్గాల్లో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. పులి సంచారం కారణంగా సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

## మోహన్‌బాబు వర్సిటీలో విద్యార్థి ఆత్మహత్య

సమగ్ర విచారణకు సిఐటియు డిమాండ్





తిరుపతి,ఫిబ్రవరి4 సినీనటుడు మోహన్ బాబు యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి బాలాజీ ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు నేతలు రుయా ఆసుపత్రికి వెళ్లి విద్యార్థి యువ నాయకులను పరామర్శించారు. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మురళి మాట్లాడుతూ గత కొంతకాలంగా విద్యార్థులు, తల్లిదండ్రుల పట్ల యూనివర్సిటీ యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో. ఓ విద్యార్థి మరణం పలు అనుమానాలను కలిగిస్తోందని అన్నారు. పోలీసులు నిష్పాక్షికంగా దర్యాప్తు జరిపి నిజా నిజాలు వెల్లడి చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తల్లిదండ్రులకు కడుపు శోకాన్ని మిగల్చకుండా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని కందారపు మురళి ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ఫోన్ బ్లాక్ చేయడంపై ఆగ్రహం

**ప్రియుడిని కిరాతకంగా చంపిన ప్రియురాలు**

రాయపూర్,ఫిబ్రవరి4 ప్రియుడు తన ఫోన్ నెంబర్ బ్లాక్ చేశాడన్న కోపంతో ఓ యువతి దారుణానికి ఒడిగట్టింది. ప్రియుడిని అతి కిరాతకంగా కత్తితో పొడిచి చంపేసింది. ఈ సంఘటన ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. బిలాస్‌పూర్‌కు చెందిన 25 ఏళ్ల కమ్తా ప్రసాద్ సూర్య వంశీ హోటల్‌లో సర్వర్‌గా పని చేస్తున్నాడు. తన స్నేహితులతో కలిసి హోటల్‌కు దగ్గరలో ఇళు అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆరు నెలల క్రితం అతడికి ఇన్‌స్టాగ్రామ్‌లో 22 ఏళ్ల రోషిణి సూర్యవంశీతో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తా ప్రేమగా మారింది. కలిసి తిరిగే వారు.. ఫోన్‌లో గంటలు, గంటలు మాట్లాడుకునే వారు. అయితే, గత మూడు రోజుల నుంచి ప్రసాద్ వింతగా ప్రవర్తించటం మొదలెట్టాడు. రోషిణి ఫోన్ నెంబర్‌ను బ్లాక్ చేశాడు. దీంతో రోషిణి తీవ్ర ఆగ్రహానికి గురైంది. అతడు వేరే అమ్మాయితో తిరుగుతున్నాడేమోనన్న అనుమానం వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం కత్తి తీసుకుని ప్రసాద్ ఉండే ఇంటి దగ్గరకు వెళ్లింది. ప్రసాద్ తలుపు తెరవగానే అతడి మొబైల్ ఫోన్ ఇవ్వాలని డిమాండ్ చేసింది. అతడు ఇందుకు ఒప్పుకోలేదు. ఇద్దరి మధ్యా గొడవ మొదలైంది. కట్టలు తెంచుకున్న కోపంతో రోషిణి ప్రసాద్‌పై కత్తితో దాడి చేసింది. నేరుగా అతడి గుండెపై పొడిచింది. ప్రసాద్ గట్టిగా అరవటంతో లోపల ఉన్న ఫ్రెండ్ బయటకు వచ్చాడు. ప్రసాద్ నేలపై రక్తపు మడుగులో పడిపోయి ఉన్నాడు. ఆ ఫ్రెండ్ వెంటనే ప్రసాద్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ప్రసాద్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు చనిపోయినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.నిందితురాలు రోషిణిని అరెస్ట్ చేశారు.

పోలీస్ అధికారి మాట్లాడుతూ.. 'ఆ యువతి మృతుడి ఇంటికి వచ్చింది. అతడి ఫోన్ ఇవ్వమని డిమాండ్ చేసింది. గొడవ సందర్భంగా కత్తితో అతడి గుండెపై పొడిచింది. అతడు అక్కడికక్కడే చనిపోయాడు' అని తెలిపారు. కాగా, బీజేపీ నాయకుడు, జిల్లా పంచాయత్ ప్రెసిడెంట్ రాజేష్ సూర్యవంశీకి ప్రసాద్ మేనల్లుడని తెలుస్తోంది.

# నమ్ముకున్న వారికి వెన్నుపోటా?

● సీనియర్ నాయకులకు టికెట్ కేటాయింపులో జరిగిన జాప్యం
● పార్టీ కోసం సర్వస్వం ధారపోసిన త్యాగాలకు గుర్తింపు దక్కేనా?
● సొంత పార్టీలోనే 'రెబల్' రాజకీయం
● ఈ డబుల్ గేమ్- పార్టీకి లాభం చేకూరుస్తుందా లేక చేటు తెస్తుందా అన్నది వేచి చూడాలి



ఖమ్మం భద్రాద్రి జిల్లా, నవతరం ప్రతినిధి: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రాజకీయ వేడి పతాక స్థాయికి చేరింది. ముఖ్యంగా అశ్వారావుపేట మున్సిపాలిటీలో జరుగుతున్న పరిణామాలు ఇప్పుడు నియోజకవర్గ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. దశాబ్దాలుగా పార్టీ జెండా మోసి, కష్ట కాలంలోనూ కాంగ్రెస్ వెంటే నడిచిన సీనియర్ నాయకులకు టికెట్ల కేటాయింపులో జరిగిన జాప్యం, ఆ తర్వాత చోటుచేసుకున్న పరిణామాలు విస్మయానికి గురిచేస్తున్నాయి.

**త్యాగాలకు గుర్తింపు దక్కేనా?**

పార్టీ కోసం సర్వస్వం ధారపోసి, క్షేత్రస్థాయిలో కేడర్‌ను కాపాడుకుంటూ వస్తున్న ఒక సీనియర్ నాయకుడికి చివరకు ఒక వార్డు మెంబర్ గా పోటీ చేసే అవకాశం దక్కింది. అయితే, ఈ అవకాశం కూడా అంత సులువుగా రాలేదని సమాచారం. ఇటీవల ఒక ప్రముఖ దినపత్రికలో "కాంగ్రెస్‌ను నమ్ముకుంటే రక్త కన్నీరే" అనే శీర్షికతో వచ్చిన కథనం పార్టీలో కలకలం



రేపడంతో, స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకొని ఆయనకు టికెట్ ఖరారు చేసినట్లు తెలుస్తోంది.

**సొంత పార్టీలోనే 'రెబల్' రాజకీయం?**

పైకి మద్దతు ప్రకటిస్తున్నట్లే కనిపిస్తున్నా, తెరవెనుక మాత్రం మరో రకమైన రాజకీయం నడుస్తోందని స్థానికంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. "ఆటో పెంట రాజకీయం" తరహాలో, ఒకవైపు అధికారిక అభ్యర్థిని నిలబెట్టి, మరోవైపు రహస్యంగా ఒక 'రెబల్' అభ్యర్థిని ప్రోత్సహిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. వ్యూహం ఏమిటి?: అధికారిక అభ్యర్థికి తెలియకుండానే, ప్రత్యామ్నాయ శక్తులకు ఊతమిస్తూ ఓట్లను చీల్చే ప్రయత్నం జరుగుతోందని కేడర్ ఆందోళన వ్యక్తం చేస్తోంది.




ఎమ్మెల్యే పాత్ర: అభ్యర్థి ఎంపికలో సహకరించిన ఎమ్మెల్యే, ప్రచార పర్వంలో మాత్రం మరో అభ్యర్థికి అనుకూలంగా పావులు కదుపుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

**నమ్మకమా.. నయవంచనా?**

పార్టీ కోసం పనిచేసిన వారికి కాకుండా, స్వార్థ ప్రయోజనాల కోసం కొత్త సమీకరణాలకు తెరలేపడం వల్ల అసలైన కార్యకర్తలు నైరాశ్యంలో ఉన్నారు. ఎన్నికల వేళ ఈ "డబుల్ గేమ్" పార్టీకి లాభం చేకూరుస్తుందా లేక చేటు తెస్తుందా అన్నది వేచి చూడాలి. ఏది ఏమైనా, అశ్వారావుపేట వార్డు ఎన్నికల్లో సాగుతున్న ఈ అంతర్గత సమరం ఇప్పుడు "టాక్ ఆఫ్ ది టౌన్"గా మారింది.

# ఫైర్ సేఫ్టీ అందరి బాధ్యత

**నగరవ్యాప్తంగా హైడ్రా అవగాహన కార్యక్రమాలు  హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్**

హైదరాబాద్, నవతరం: వస్తున్నది వేసవి కాలం. నిప్పు రగిలితే మంటలు వ్యాపించి భారీ మొత్తంలో ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తుంది. ఇలాంటి తరుణంలో ప్రతి ఒక్కరూ ఎవరికి వారు జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది. ఇప్పటికే హైడ్రా తనిఖీలు చేసి కొన్ని షాపులను సీజ్ చేయడమైంది. నెల రోజులు వ్యవధి కావాలని షాపుల యజమానులు, వ్యాపార సంఘాలకు చెందిన ప్రతినిధులు విజ్ఞప్తి చేయగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఫిబ్రవరి నెలవరకూ సమయం ఇచ్చారు. ఇదే సమయంలో అగ్ని ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలను హైడ్రా చేపట్టింది. నగర వ్యాప్తంగా మాక్ డ్రిల్స్, అవగాహన కార్యక్రమాలను సంబంధిత శాఖలతో కలిసి హైడ్రా పెద్దయెత్తున నిర్వహిస్తోంది. ఎవరికి వారు ఆలోచించి అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు అనుసరించాల్సిన ప్రాథమిక అంశాలను ఈ కిందన పొందుపరుస్తున్నాం. వీటిని తూచా తప్పకుండా పాటించాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నగర ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.




**సెల్లార్లను గోదాములుగా మార్చకండి**

సెల్లార్లను వాహనాల పార్కింగ్ కోసమే వినియోగించండి. మీ వ్యాపారానికి సంబంధించిన గోదాముగా మార్చకండి. ఆ వస్తువులు పోతాయని గ్రిల్స్ ఏర్పాటు చేసి తాళాలతో బంధించరాదు.

సెల్లార్లలో చెత్త పేరుకుపోకుండా జాగ్రత్త పడండి. ఆ చెత్తకు నిప్పంటుకుని వ్యాపార సముదాయం మొత్తం అగ్ని ప్రమాదంలో చిక్కుకునే అవకాశం ఉంటుంది.

● సెల్లార్లలో వాచ్ మ్యాన్ నివాసాలు లేకుండా చూడండి. అలాగే క్యాంటిన్ల నిర్వహణ, వంటలు చేయడం.. చెత్త తగుల బెట్టడం చేయరాదు.

**దారులు మూసేయకండి**

● సెల్లార్లతో పాటు.. ర్యాంపులు, కారిడార్లు, మెట్ల మార్గాలు ఖాళీగా ఉంచండి.. మీ వ్యాపార వస్తువులను నిలువ ఉంచి దారులు మూసేయకండి.

● అగ్ని ప్రమాదం జరిగితే ఎటువైపు నుంచి సులభంగా బయట పడగలమో ఎగ్జిట్ మార్గాలను సూచిస్తూ సైన్ బోర్డులు పెట్టండి.

● లిఫ్ట్‌లో పై అంతస్తులకు వెళ్లే అవకాశం ఉంది కదా అని మెట్ల మార్గాలను వస్తువులతో మూసేయవద్దు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు లిఫ్టును వినియోగించరాదు కనుక మెట్ల మార్గమే సరైనది.

**నాణ్యమైన విద్యుత్ పరికరాలనే వాడండి**

● ఐఎస్‌వో స్టాండర్డ్ కరెంటు వైర్లను, స్విచ్ బోర్డులను, ప్యానెల్ బోర్డులను మాత్రమే వినియోగించండి. నాణ్యమైన వస్తువులు వాడకపోతే కాలిపోయే ప్రమాదాలుంటాయి. మీరు వినియోగిస్తున్న విద్యుత్ లైన్లకు ఎర్తింగ్ సరిగా ఉందో లేదో చూసుకోవాలి.

● మీరు విద్యుత్ వినియోగానికి తగ్గట్టు పవర్ కనెక్షన్లు తీసుకోండి. తర్వాత ఏసీలు ఇతర విద్యుత్ వాడక వస్తువులు వినియోగిస్తే పవర్ సరిపోక ట్రిప్ అయ్యే ప్రమాదం ఉంటుంది.

● కరెంటు స్తంభం నుంచి వచ్చే వైర్లు, వ్యాపార సముదాయానికి విద్యుత్‌ను సరఫరా చేసే వైర్లను అనుసంధానం చేసే ప్యానల్ బోర్డు వద్ద పొరపాటున నిప్పురవ్వలు పడినా వెంటనే మంటలు అంటుకోకుండా.. కంకరతో ప్రత్యేక చాంబర్లు ఏర్పాటు చేయాలి.

● విద్యుత్ సర్క్యూట్‌లపై ఓవర్‌లోడ్ ఉండకూడదు మరియు వైరింగ్‌లో ఎలాంటి జాయింట్లు ఉండకూడదు.

**ఫైర్ సేఫ్టీ పరికరాలు అమర్చండి**

● అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే అప్రమత్తం చేసే స్మోక్ డిటెక్టర్లు ప్రతి సముదాయంలో ఉండాలి.

● మానవ ప్రమేయం లేకుండా మంటలను ఆర్పే వాటర్ స్ప్రింక్లర్లు అమర్చాలి.

● ఫైర్ ఎక్స్టింగ్విషర్లు అందుబాటులో ఉంచాలి.

● ఇవన్నీ పని చేస్తున్నాయో లేదో.. సమయానుకూలంగా పరీక్షించుకుని పనిచేసే విధంగా ఉంచాలి.

● షాపుల్లో, వ్యాపార సముదాయాల్లో పని చేసే ప్రతి ఒక్కరికీ ఫైర్ ఎక్స్టింగ్విషర్ వినియోగించడం **ఎలా అనేది శిక్షణ ఇవ్వండి.**

● అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే అప్రమత్తం చేసేలా ఫైర్ అలారమ్(రెడ్ బటన్) ప్రెస్ చేసేందుకు వీలుగా అమర్చండి.

**ఈ కింది జాగ్రత్తలు కూడా తీసుకోండి**

● విద్యుత్ బల్బులు, ట్యూబ్‌లైట్లకు దగ్గరగా ఎలాంటి వస్తువులు నిలువ ఉంచరాదు. డోర్ కర్టెన్లు, దుస్తులు ఉంచరాదు.. బల్బు వెడికి నెమ్మదిగా మంటలు అంటుకునే ప్రమాదం ఉంటుంది.

● షాపు అలంకరణకు ఉద్దేశించిన వైర్ల జాయింట్లు, సీరియల్ బల్బులు, ఫాల్ సీలింగ్ లైట్లు అమర్చేటప్పుడు ఎక్కడైనా కరెంటు షార్ట్ సర్క్యూట్ అయ్యేప్రమాదం ఉండకుండా చూడండి.


● మరీ ముఖ్యంగా అపార్టుమెంట్ల కింది భాగంలో వ్యాపార కార్యకలాపాలు, షాపుల మాదిరి వినియోగిస్తే మరింత అప్రమత్తంగా ఉండండి. మంటలకు ఆస్కారం లేకుండా జాగ్రత్త పడండి.

● మీ ఇంటికి చేరువలో అగ్ని ప్రమాదానికి ఆస్కారం ఉండే పరిస్థితులున్నా.. ఫైర్ నిబంధనలు ఉల్లంఘించినట్టు ఎవరైనా గమనిస్తే.. హైడ్రా కంట్రోల్ రూమ్ 9000113667 నంబరుకు పూర్తి సమాచారంతో పాటు.. వీడియోలు, ఫొటోలు, కరెంట్ లొకేషన్‌ను చెబుతూ సమాచారం ఇవ్వండి.

● అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ ఇంజిన్ కోసం, మంటలను ఆర్పడం కోసం 101 కి ఫోను చేయాలి.

## తిరుపతిలో విద్యార్థి నాయకుల కిడ్నాప్ కలకలం

**మంచు మోహన్‌బాబు, మంచు విష్ణులపై కేసు నమోదు**



హైదరాబాద్ / తిరుపతి, నవతరం: తిరుపతిలోని మోహన్‌బాబు యూనివర్సిటీలో జరుగుతున్న ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపేందుకు బయలుదేరిన ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి అక్బర్, ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థి నాయకుడు వినోద్‌లను, తిరుచానూరు వద్ద వాహనాల్లో కిడ్నాప్ చేసి తీసుకెళ్ళారు 30 మంది దుండగులు. సమాచారం అందుకుని వాహనాలను వెంబడించి, బాధితులను విడిపించి, నిందితులను అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. బాధితుల ఫిర్యాదు మేరకు మోహన్‌బాబును ఏ -2గా, మంచు విష్ణును ఏ-3గా, యూనివర్సిటీ పిఆర్వో సతీష్‌ను ఏ-1గా చేరుస్తూ కేసు నమోదు చేశారు పోలీసులు.





బుధవారం ఏడుపాయల వనదుర్గ అమ్మవారి మహాశివరాత్రి సందర్భంగా జాతర ఏర్పాట్ల పై జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి, నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, డీఎస్పీ ప్రసన్న కుమార్ సంబంధిత జిల్లా అధికారులతో కలిసి ఏడుపాయల హరిత హోటల్ నందు నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న అంత ముందు ఏడుపాయల పరిసరాలను సంబంధిత శాఖ అధికారులతో కలిసి నిర్వహించాల్సిన ఏర్పాట్లపై అధికారులకు జిల్లా కలెక్టర్ దిశ నిర్దేశం చేశారు.
మెదక్, నవతరం..

## బాలికపై అత్యాచారం... 20 ఏళ్ల జైలు



హైదరాబాద్ / రాజేంద్రనగర్, నవతరం: ప్రేమపేరుతో బాలికను మోసం చేసిన ఓ వ్యక్తికి 20 సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ రాజేంద్రనగర్‌లోని పోక్సో కోర్టు జడ్జి పి.ఆంజనేయులు తీర్పు వెలువరించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేశ్వర్‌రెడ్డి వివరాల మేరకు.శంషాబాద్ ఆర్‌జీఐఏ పీస్ పరిధిలో నివసించే టి. నర్సింహ వాటర్ ట్యాంకర్ నడిపేవాడు.స్థానికంగా 9వ తరగతి చదువుతున్న ఓ బాలిక(15) నీళ్ల కోసం ట్యాంకర్ దగ్గరకు వచ్చేది. బాలికతో తరచూ మాట్లాడుతూ... స్నేహం పెంచుకొని ప్రేమిస్తున్నట్లు చెప్పాడు. 2020 జూన్ 13న బాలికను తీసుకొని ఆర్టీసీ బస్సులో జడ్చర్ల వెళ్లాడు. అక్కడ ఓ గదిని అద్దెకు తీసుకొని నివాసం ఉంటూ.బాలికపై పలుమార్లు అత్యాచారం జరిపాడు. 2020 జులై 11న ఆమెను శంషాబాద్ తీసుకొచ్చి బస్టాండ్‌లో వదిలి వెళ్లిపోయాడు. బాలిక తల్లిదండ్రులు ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు.నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో విచారణ అనంతరం నిందితుడికి 20 సంవత్సరాల జైలుశిక్ష పడింది. బాలికకు రూ.3 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.

## సుత్తితో కొట్టి... బంగారం ఎత్తుకెళ్లి..

**వృద్ధ మహిళ హత్య కేసును 24 గంటల్లో ఛేదించిన పోలీసులు**



దుండిగల్, నవతరం: దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన వృద్ధ మహిళ హత్య కేసును 24 గంటల్లో ఛేదించినట్లు మేడ్చల్ డివిజన్ ఏసీపీ సీ.హెచ్. శంకర్ రెడ్డి ఈ రోజు దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో తెలిపారు. ఈ కేసుకు సంబంధించి జతీ.చీశీ:108/2026 ఖ/o 103, 305 బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. దుండిగల్ లోని చర్చి గాగిలాపూర్‌కు చెందిన చిన్నబత్తిని సుశీలమ్మ (85) అనే వృద్ధ మహిళ ఒంటరిగా నివాసం ఉంటుందని తెలిపారు. కాగా గతంలో నిందితురాలు పి. కవిత (36), అదే గ్రామానికి చెందిన వ్యక్తి కాగా, మృతురాలి వద్ద 15 రోజుల పాటు మేస్త్రీ పని చేసినట్లు వెల్లడించారు. 2026 ఫిబ్రవరి 2వ తేదీ మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో సుశీలమ్మ ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు కవిత సుత్తెతో తలపై మొది హత్య చేసింది. అనంతరం సుశీలమ్మ వద్ద ఉన్న బంగారు చెవి కమ్మలు, చేతి వేలి ఉంగరాన్ని దొంగిలించి పరారైనట్లు ఏసీపీ వివరించారు. సాంకేతిక ఆధారాలతో నిందితురాలిని గుర్తించి, తేదీ ఈ నెల 3వ తేదీన రాత్రి 9:30 గంటలకు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితురాలి వద్ద నుంచి ఒక జత బంగారు చెవికమ్మలు, ఒక బంగారు ఉంగరాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. దుండిగల్ పోలీస్, సీసీఎస్, ఎస్ఓటీ పోలీసులు బృందాలు గా ఏర్పడి కేసును ఛేదించాయని చెప్పారు. ఈ కేసు దర్యాప్తు లో కీలకంగా మారిన సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసిన చర్చి గాగిలాపూర్‌కు చెందిన శ్రీకర్ రెడ్డి ని సన్మానించనున్నట్లు తెలిపారు. ఈ కేసును మేడ్చల్ ఏసీపీ సీ.హెచ్. శంకర్ రెడ్డి పర్యవేక్షణలో దుండిగల్ పోలీస్, సీసీఎస్, ఎస్ఓటీ బృందాలు తక్కువ సమయంలో ఛేదించారు. ఈ దర్యాప్తులో సీసీఎస్ ఏసీపీ వై. నాగేశ్వరరావు, పీ. సతీష్ (దుండిగల్ ఇన్‌స్పెక్టర్), ఎం. బాలరెడ్డి (దుండిగల్ డీఐ), పీ. దాలి నాయుడు (మేడ్చల్ సీసీఎస్ ఎస్ఐ), టి. శంకర్ (మేడ్చల్ సీసీఎస్ ఎస్ఐ), డీఎన్ ఈశ్వర్ (దుండిగల్ ఎస్ఐ) తదితర క్రైమ్ సిబ్బంది సమష్టిగా దర్యాప్తు చేశారు.

# అనిషా వలలో అవినీతి తిమింగళం

### పదిహేను లక్షల రూపాయల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ జీహెచ్ఎంసీ ఎస్ఈ



కూకట్పల్లి, నవతరం: ప్రభుత్వ కార్యాలయాల్లో వేళ్లూనుకున్న అవినీతికి మరో బలమైన ఉదాహరణగా కూకట్పల్లి జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు. దాడుల్లో జీహెచ్ఎంసీ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) చిన్నారెడ్డి ఓ కాంట్రాక్టర్ నుంచి .15 లక్షల లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్గా పట్టుబడ్డారు. పెండింగ్లో ఉన్న బిల్లుల క్లియరెన్స్ కోసం కాంట్రాక్టర్ను లంచం ఇవ్వాలని ఒత్తిడి చేసినట్లు ఏసీబీ వర్గాలు వెల్లడించాయి. లంచం డిమాండ్తో విసిగిపోయిన బాధిత కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించడంతో, అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్నారు. ముందస్తుగా ఏర్పాటు చేసిన ట్రాప్లో భాగంగా లంచం స్వీకరిస్తున్న సమయంలోనే ఎస్ఈని అదుపులోకి తీసుకుని నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ అధికారులు కార్యాలయంలో సుదీర్ఘంగా తనిఖీలు నిర్వహిస్తూ సంబంధిత పత్రాలు, ఫైళ్లను పరిశీ లించారు. నిందితుడి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకుని, లంచం డిమాండ్కు సంబం ధించిన ఆధారాలను సేకరించినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు. ప్రజా సేవకులుగా వ్యవహరించాల్సిన అధికారులు లంచాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోందని, లంచం డిమాండ్లో ఇతరుల పాత్ర ఉందా అనే అంశంపై కూడా దర్యాప్తు చేపట్టినట్లు ఏసీబీ వర్గాలు వెల్లడించాయి.



అనిషా వలలో చిక్కిన జీహెచ్ఎంసీ సూపరిండెంట్ ఇంజనీర్ చిన్నారెడ్డి

# క్షేత్రస్థాయిలో పరిశీలించిన హైడ్రా కమిషనర్

## - కాముని చెరువుతో పాటు తుర్కచెరువు అభివృద్ధికి ఆదేశం


హైదరాబాద్, నవతరం: ప్రజావాణి ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భరత్నగర్ - ఖైతలాపూర్ - హైటెక్ సిటీ రోడ్డుకు ఎడమవైపు ఉన్న కాముని చెరువు మురుగు నీటితో దుర్గంధభరితంగా మారడంతో గుర్రపు డెక్క వ్యాపించి దోమల బెడదతో రోగాలబారిన పడుతున్నామని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ చెరువు చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించి చెరువును అభివృద్ధి చేయాలని హైడ్రా కమిషనర్ను కోరారు. చెరువు ఇన్లెట్లు, ఔట్లెట్లను పరిశీలించి.. వెంటనే ఈ చెరువు అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను హైడ్రా కమిషనర్ ఆదేశించారు. అలాగే జలమండలికి - స్థానికంగా ఉన్న ముస్లింలకు మధ్య ఉన్న గ్రేవ్యార్డు స్థలవివాదాన్ని కూడా కమిషనర్ పరిశీలించారు. ఇక్కడ అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి వివరాలు తెలుసుకుంటామని.. తర్వాత గ్రేవ్యార్డు సమస్య పరిష్కరిస్తామని హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా వారికి తెలిపారు. ప్రభుత్వ భూమి ఎంత అందుబాటులో ఉందో తెలుసుకుని ఆ మేరకు ఫెన్సింగ్ వేయాలని హైడ్రా అధికారులను కమిషనర్ ఆదేశించారు. తర్వాత కూకట్పల్లి, శంషిగూడ లోని శిల్పా బృందావన్ కాలనీ హెచ్ ఎండీఏ లే ఔట్ను మార్చేసి.. పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని లే ఔట్ వేస్తున్నారనే ఫిర్యాదును కూడా హైడ్రా కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇక్కడ ప్రభుత్వ భూమి వివరాలు తెలుసుకుని ఆ మేరకు ఫెన్సింగ్ వేయాలని సూచించారు.





**తుర్క చెరువునూ అభివృద్ధి చేస్తాం..**

నిజాంపేటలోని బండారీ లేఔట్కు ఆనుకుని ఉన్న తుర్క చెరువును కూడా హైడ్రా అభివృద్ధి చేస్తోందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అక్కడి స్థానికులకు వివరించారు. చెరువులోకి మురికి నీరు చేరి పరిసరాలన్నీ దుర్గంధభరితంగా.. దోమల బెడదతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించారు. 43.50 ఎకరాల చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ముందుగా మురుగునీరును బయటకు పంపి.. పూడికను తొలగించిన తర్వాత చెరువు సుందరీకరణ పనులు చేపడతామన్నారు. మురుగు నీరు కలవకుండా ఎస్టీపీలను ఏర్పాటు చేసి.. చుట్టూ వాకింగ్ ట్రాక్లు, ప్లేఏరియాలు, పార్కులు అందుబాటులోకి వస్తాయన్నారు. అలాగే కూకట్పల్లి నుంచి జీడిమెట్ల వెళ్లే ఉషాముల్లపూడి రోడ్డులో ఉన్న ఎల్లమ్మ కుంట అభివృద్ధికి కూడా సహకరిస్తామని తెలిపారు. చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని సీఎస్ ఆర్ నిధులతో పనులు చేపట్టిన భవ్య కన్స్ట్రక్షన్స్ సంస్థ ప్రతినిధులకు సూచించారు. ఈ చెరువు ఎఫ్టీఎల్ హద్దులను నిర్ధారిస్తామని..



వెంటనే ఈ పనులు చేపట్టాలన్నారు. ప్రగతినగర్ చెరువు చెంత చేపలు, మాంసం దుకాణాల తరలింపును హైడ్రా కమిషనర్ పరిశీలించారు. త్వరలోనే ఈ చెరువు అభివృద్ధి పనులు కూడా ప్రారంభిస్తామని ఈ సందర్భంగా స్థానికులకు చెప్పారు. పలు కాలనీ వాసులు, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు హైడ్రా కమిషనర్కు మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. చెరువుల అభివృద్ధితో పాటు.. పార్కులను, రహదారులు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కాపాడుతున్నారంటూ శాలువతో సన్మానించారు.


# ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతి ఒక్కరూ భాద్యతగా విధులు నిర్వర్తించాలి

**- ఎస్పీ రోహిత్ రాజు**

**- మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ**

**ఖమ్మం భద్రాద్రి జిల్లా నవతరం ప్రతినిధి**

మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీస్ శాఖ తరఫున కట్టుదిట్టమైన చర్యలను చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఒక ప్రకటనను విడుదల చేశారు.ఇందులో భాగంగానే జిల్లాలోని మూడు మున్సిపాలిటీల పరిధిలో జరగనున్న ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులతో ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ 08 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు,04 స్టాటిక్ సర్వేలయన్స్ బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.కొత్తగూడెం కార్పొరేషన్,ఇల్లందు,అశ్వారావుపేట మున్సిపాలిటీలకు ఈ నెల 11వ తేదీన జరగనున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లావ్యాప్తంగా మూడు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 101 పోలింగ్ స్థానాలలోని 288 పోలింగ్ కేంద్రాలలో ఈ నెల 11వ తేదీన పోలింగ్ జరగనుంది. ఇందులో సాధారణ పోలింగ్ కేంద్రాలు 148, సున్నితమైన పోలింగ్ కేంద్రాలు 125 మరియు 15 క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తెలిపారు.మున్సిపాలిటీల వారీగా సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరిస్తూ ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు.ఎన్నికల పోటీలో నిలుచున్న అభ్యర్థులు తప్పనిసరిగా సంబంధిత అధికారుల వద్ద నుండి అనుమతులు పొందిన తర్వాతనే తమ ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని కోరారు.అనుమతులు లేనియెడల ఎన్నికల నియమావళి ప్రకారం అట్టి అభ్యర్థులపై కేసుల నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.ఓటర్లను ప్రలోభపరిచే విధంగా ఎవరైనా నగదు,మద్యం,ఇతరత్రా సామాగ్రిని అక్రమ రవాణా చేస్తూ పట్టుబడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై కూడా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,ఇల్లందు డిఎస్పీ వెంకన్న బాబు,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,డీసిఆర్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,కొత్తగూడెం 2టౌన్ సీఐ ప్రతాప్,1టౌన్ సీఐ కరుణాకర్,3టౌన్ సీఐ ఇంద్రాసేనారెడ్డి,పాల్వంచ సీఐ సతీష్,ఇల్లందు సీఐ సురేష్,చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు మరియు ఎస్సైలు,సిబ్బంది పాల్గొన్నారు.



## పదేండ్ల పాలనలో సిరిసిల్లకు ఒరిగిందేమీ లేదు





రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో రూపాయి వచ్చింది లేదు. సిరిసిల్లకు నిధులు తెచ్చింది మేము, అభివృద్ధి చేసింది మేము. 14, 15వ ఆర్థిక సంఘాల ద్వారా రూ.29 కోట్లు, అమృత్ పథకం కింద రూ.50 కోట్లు, పీఎం స్వనిధి కింద రూ.21 కోట్ల 52 లక్షలు, స్వచ్ఛ భారత్ కింద రూ.44 లక్షలు తెచ్చినం. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో లేకపోయినా కేంద్రం నుండి నిధులు తెచ్చాం. సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే మరింత అభివృద్ధి సాధ్యం. సిరిసిల్ల ప్రజలను ఒక్కటే కోరుతున్నా.. నిధులు తెచ్చిన, అభివృద్ధి చేస్తున్న బీజేపీని ఆశీర్వదించండన్నారు.ఐ

## గజాల పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా




హైదరాబాద్, నవతరం: రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం, మీర్పేట్ మున్సిపాలిటీ పరిధిలోని నంది హిల్స్ కాలనీలోని 2100 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా పరిరక్షించింది. కాలనీలో ప్రజావసరాల కోసం కేటాయించిన ఈ పార్కు స్థలంలో కొంత భాగాన్ని కొందరు రాజకీయ నాయకుల బై నంబర్ వేసి ఆక్రమించారు. నకిలీ లేఅవుట్లు సృష్టించారని కాలనీ వాసులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి.. రికార్డులను పరిశీలించిన అనంతరం ఆక్రమణలు జరిగినట్టు నిర్ధారించారు. వెంటనే చర్యలు తీసుకుని 2100 గజాల పార్కు స్థలాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకుని ప్రజావసరాలకు కాపాడారు. హైడ్రా చర్యలను స్థానికులు అభినందించారు. ప్రజావసరాలకు కేటాయించిన భూములను, పార్కులు, ఓపెన్ స్థలాలను ఆక్రమణల నుంచి కాపాడడంలో హైడ్రా కీలక పాత్ర పోషిస్తోందని కాలనీ వాసులు పేర్కొన్నారు.

## ఇంట్లోనే మృత్యువు.. నమ్మిన చేతులే కత్తులయ్యాయి



దుండిగల్, నవతరం: తెలంగాణ రాష్ట్రం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ పోలీస్ స్టేషన్లో ఏసీపీ శంకర్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, సోమవారం చర్చి గాగిల్లాపూర్లో జరిగిన వృద్ధురాలి హత్య కేసును పోలీసులు 24 గంటల్లోనే ఛేదించినట్లు వెల్లడించారు. చర్చి గాగిల్లాపూర్కు చెందిన 85 ఏళ్ల సుశీలమ్మ హత్య కేసులో, ఆమె ఇంట్లో పనిచేసే పని మనిషి కవిత (36)ను పోలీసులు అరెస్టు చేశారు. బంగారం కోసం ఈ ఘాతుకానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది.

## ప్రతి శనివారం హైడ్రా ఫోన్ ఇన్

హైదరాబాద్, నవతరం: ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిరాటంకంగా కొనసాగిస్తున్న హైడ్రా ఇప్పుడు మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతి శనివారం ఫోన్-ఇన్ కార్యక్రమాన్ని ప్రారంభించాలని హైడ్రా నిర్ణయించింది. ఈ శనివారం నుంచే ప్రారంభించాలని హైడ్రా బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. సెలవు రోజులు మినహా.. ప్రతి శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకూ ఈ కార్యక్ర మాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొంది. ఔటర్ రింగురోడ్డు పరిధిలో ఉన్న నగర ప్రజలు 040-29565750, 040-29565759 ఈ రెండు ఫోను నంబర్లకు ఫోను చేసి ఫిర్యాదులు చేయవ చ్చునని తెలిపింది. చెరువులు, పార్కులు, రహదారులు, ప్ర జావసరాలకు ఉద్దేశించిన స్థలాల ఆక్రమణలు, చెరువుల్లో మ ట్టి పోయడం వంటి అంశాలపై ఫిర్యాదు చేయవచ్చునని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. గతంలో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు ఏవైనా పరిష్కారం కాకపోతే.. వాటి గురించి కూడా ఈ ఫోన్ ఇన్ కార్యక్రమంలో తెలుసుకోవ చ్చున్నారు.

# ఉమ్మడి జిల్లాలో పురపోరులో జోరు

**బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి**
**ఎక్కడిక్కడ ప్రచారంలో నేతలు బిజీ**

నిజామాబాద్,ఫిబ్రవరి4 ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కుట్రలు, కుతంత్రాలతో ప్రతిపక్ష పార్టీ నాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి మున్సిపల్ ఎన్నికలే నాంది పలుకుతాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. పార్టీ అభ్యర్థులు ఐక్యతతో పనిచేసి ప్రజల ఆశీర్వాదంతో ఘన విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. మున్సిపల్ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ పార్టీలోకి కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి వలసలు కొనసాగుతున్నాయనిమాజీ మంత్రి అన్నారు. తెలంగాణను బీడు భూమిగా మార్చిన కాంగ్రెస్ మాయ మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. బీఆర్ఎస్‌తోనే నగర అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రజలు కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఇదిలావుంటే పురపాలక ఎన్నికలకు భారత రాష్ట్ర సమితి పక్కా వ్యూహంతో దూసుకుని పోతోంది. ఉమ్మడి జిల్లాలో పురపాలక పీఠాలను కైవసం చేసుకునేందుకు ముఖ్య నేతలంతా రంగంలోకి దిగారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎదురైన అనుభవాలను క్రోడీకరించి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మాదిరిగానే అద్భుతమైన ఫలితాలు రాబట్టేందుకు పని చేయాలని వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. కీలకమైన నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటుగా ఆర్మూర్, బోధన్, భీంగల్ పురపాలక పీఠాలపై గులాబీ జెండాను ఎగురవేసేందుకు నేతలంతా రంగంలోకి దిగారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తన నియోజకవర్గంలోని భీంగల్ మున్సిపాలిటీని స్వాధీనం చేసుకునేందుకు అడుగులు వేస్తున్నారు. గెలుపు గుర్రాలనే ఎంపిక చేసి బరిలోకి దింపారు. ఆర్మూర్‌లో వరుసగా గులాబీ జెండాను రెపరెపలాడించేందుకు ఆశన్నగారి జీవన్ రెడ్డి చురుగ్గా వార్డుల్లో కలియ తిరుగుతున్నారు. బోధన్‌లో షకీల్ దంపతులు విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తూ దూసుకు పోతున్నారు. నిజామాబాద్ నగరంలో మరోసారి సత్తా చాటేందుకు బిగాల గణెశ్ గుప్తా తనదైన శైలిలో వ్యూహాలను రచిస్తున్నారు. కామారెడ్డి జిల్లాలో మొత్తం నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయి. కామారెడ్డి పురపాలక సంఘం లో వరుసగా మూడోసారి బీఆర్ఎస్ జెండాను ఎగిరేసేందుకు ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ ప్రణాళికలు రచిస్తున్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి వీజీ గౌడ్‌తో సమన్వయం చేసుకుంటూ కార్యరంగంలో దూసుకు పోతున్నారు. అన్ని వార్డుల్లో కాంగ్రెస్, బీజేపీతో బలంగా తలబడే నాయకులకు కౌన్సిలర్ టికెట్లు కేటాయించి ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మైనార్టీ ఏరియాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ఏర్పడిన అసంతృప్తిని అనుకూలంగా మార్చుకునేందుకు గంప గోవర్ధన్ పాటు పడుతున్నారు. ఎల్లారెడ్డిలోనూ సగానికి ఎక్కువ సీట్లు గెలిచి బీఆర్ఎస్ జెండాను మరోసారి ఎగిరేసేందుకు జాజాల సురేందర్ ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. బాన్సువాడలో పార్టీ మారిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి పురపాలక ఎన్నికల ద్వారా గట్టి సమాధానం ఇచ్చేందుకు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నాయకత్వంలో బీఆర్ఎస్ శ్రేణులు బలంగా పని చేస్తున్నాయి. బిచ్కుంద మున్సిపాలిటీలో తొలిసారి ఎన్నికలు జరుగుతుండటంతో బీఆర్ఎస్ నేతలంతా కౌన్సిలర్‌గా పోటీ చేసి విజయం సాధించేందుకు భారీగా ఉత్సాహం చూపుతున్నారు. ఈ ఎన్నికలను మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే సవాల్‌గా తీసుకుని పని చేస్తున్నారు. ఈ పోరులో కారు గుర్తుతో ప్రజల్లోకి బలంగా వెళ్లి వారి మద్దతును కూడగట్టేందుకు బీఆర్ఎస్ నేతలంతా ప్రయత్నాలు మొదలు పెట్టారు.


# రెండు భవనాలను సీజ్ చేసిన హైడ్రా అధికారులు

**ప్రజావసర స్థలాల్లో 5 అంతస్తుల భవనాలు కోర్టులో కేసుండగా కొనసాగుతున్న పనులు**




హైదరాబాద్, నవతరం: అవి ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు.. అక్కడ ఫేక్ ఎల్ ఆర్ ఎస్‌లు సృష్టించారు కబ్జాదారులు. అలా సృష్టించిన ఎల్ ఆర్ ఎస్‌తో భవన అనుమతులు తీసుకున్నారు. 5 అంతస్తుల భవనాలు నిర్మాణం జరిగాక మణికొండ మున్సిపల్ అధికారులు ఆ స్థలాలు ప్రజావసరాలకు ఉద్దేశించినవని చెబుతూ తమ పరిధిలో ఉన్న భవన అనుమతులు రద్దుచేశారు. నేరుగా హెచ్ ఎం డీఏ నుంచి అనుమతులు తీసుకున్నందున మరో భవన నిర్మాణ అనుమతులు రద్దుచేయాలంటూ హెచ్ ఎం డీఏకు మణికొండ మున్సిపల్ అధికారులు లేఖ రాశారు. ఇవన్నీ అయ్యేలోపు గృహప్రవేశం చేసేయాలన్నంత వేగంగా నిర్మాణాలు జరిగిపోతున్నాయి. ఇంతలో అక్కడి నివాసితులు హైడ్రాను ఆశ్రయించారు. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల్లో రెండు 5 అంతస్తుల భవనాల నిర్మాణాలు జరిగిపోతున్నాయని... ఆ అనుమతులను రద్దు చేసినా నిర్మాణాలు ఆగడంలేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఇక హైడ్రాకు ఫిర్యాదు వచ్చిందని తెలుసుకున్న నిర్మాణదారులు... కోర్టును ఆశ్రయించారు. ఇదేదో విషయం తెలుసుకోవాలని హైడ్రాను హైకోర్టు ఆదేశించింది. భవన నిర్మాణ పనులను వెంటనే ఆపాలని హైకోర్టు నేరుగా చెప్పలేదన్న నెపంతో నిర్మాణ పనులను మరింత వేగం చేశారు. నిర్మాణాలు చేపట్టిన వారితో పాటు.. అక్కడి నివాసితులను, ఫిర్యాదు దారులను హైడ్రా పిలిపించి విచారించింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పూర్తి వివరాలు తెలుసుకున్నారు. పనులు జరకుండా అ రెండు భవనాలను సీజ్‌చేయాలని ఆదేశించారు. ఈ మేరకు హైడ్రా బుధవారం ఆ రెండు భవనాలను సీజ్ చేసి ఫెన్సింగ్ వేసింది. రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ మండలం, నెక్నాంపూర్ విలేజ్‌లోని మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ హెచ్ ఎండీఏ లే ఔట్ అది. ఇందులో ప్రజావసరాలకు ఉద్దేశించి 300ల గజాల చొప్పున 4 ప్లాట్లు కేటాయించారు. ఆ నాలుగుతో పాటు.. పక్కనే ఉన్న మరి కొంత కలిపి దాదాపు 1500ల గజాల వరకూ స్థలాన్నిచూపించి.. ఫేక్ ఎల్ ఆర్ ఎస్‌తో మణికొండ మున్సిపాలిటీలో భవన నిర్మాణ అనుమతులు పొందారు. ఇక్కడ జీ ప్లస్ 5 అంతస్తుల భవనాన్ని నిర్మించారు. ఇదే లే ఔట్‌లో సెప్టిక్ ట్యాంకు / పార్కు స్థలంగా కేటాయించిన దాదాపు 2 వేల గజాల స్థలంలో




మరో ప్రబుద్ధుడు ఎల్ ఆర్ ఎస్‌తో పాటు.. భవన నిర్మాణ అనుమతులను నేరుగా హెచ్ ఎండీఏ నుంచే తీసుకున్నారు. ఇక జెట్ స్పీడులో నిర్మాణాలు చేస్తున్నారు. 5 అంతస్తుల భవనాలు వెలిశాక.. ఈ రెండు నిర్మాణాలు జరుగుతున్న స్థలాలు ప్రజావసరాలకు ఉద్దేశించినవని... ఫేక్ ఎల్ ఆర్ ఎస్‌తో ఒక భవన అనుమతి పొందారని.. మరొకటి హెచ్ ఎండీఏ ఇచ్చిందని చెబుతూ వాటి రద్దుకోసం ప్రయత్నించారు. మణికొండ మున్సిపాలిటీ ఇచ్చిన అనుమతిని 2025లో రద్దు చేశారు. ఇలా పూర్వాపరాల పరిశీలన ఒక వైపు సాగుతోంది. హైకోర్టు ఈ విషయమై విచారించమని హైడ్రాను ఆదేశించింది. హైడ్రా విచారణ చేపట్టింది. ఎవరి పనిలో వారుండగా.. నిర్మాణదారులు మాత్రం నిరాటంకంగా.. మరింత వేగంగా పూర్తి చేసి.. గృహప్రవేశాలు కూడా చేసేయాలనే ఆలోచనతో నిర్మాణాల వేగాన్ని పెంచారు. ఇప్పుడా ఆ రెండు భవనాల నిర్మాణాన్ని హైడ్రా అడ్డుకుంది. జీహెచ్ ఎంసీ, రెవెన్యూ విభాగాలతో కలిసి హైడ్రా ఫెన్సింగ్ వేసి భవన నిర్మాణ పనులను ఆపేసింది.

# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన రద్దు

**ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ముర్ము**
**కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి4 మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను రద్దు చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము బుధవారంనాడు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రాజ్యాంగంలోని 356వ అధికరణలోని క్లాజ్ (2) ద్వారా తనకు సంక్రమించిన అధికారాలతో 2025 ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ జారీ చేసిన ఆదేశాలను రద్దు చేస్తున్నట్టు రాష్ట్రపతి ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2026 ఫిబ్రవరి 4వ తేదీ నుంచి తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చినట్టు తెలిపారు. జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్ అట్టుడకడంతో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ గతేడాది రాజీనామా చేశారు. దీంతో తొలుత 6 నెలలపాటు అక్కడ రాష్ట్రపతి పాలన విధించి మరోసారి దానిని పొడిగించారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు కేంద్రం చేపట్టిన సన్నాహకాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర శాసనసభా పక్ష నేతగా యుమునాం ఖేమ్‌చంద్ సింగ్‌ను ఆ పార్టీ ఎమ్మెల్యేలు మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో 62 ఏళ్ల ఖేమ్‌చంద్ మణిపూర్ కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మణిపూర్ రాజకీయాల్లో బీజేపీ కీలక నేతగా ఖేమ్‌చంద్ పేరు తెచ్చుకున్నారు. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఇంఫాల్ వెస్ట్‌లోని సింజమా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2017 మార్చి నుంచి 2022 మార్చి వరకూ మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. 2022 అసెంబ్లీ



ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించడంతో బీరేన్ సింగ్ ప్రభుత్వంలో రెండోసారి క్యాబినెట్ మంత్రిగా సింగ్ నియమితులయ్యారు. మున్సిపల్ పాలనా వ్యవహారాలు, హౌసింగ్ డెవలప్‌మెంట్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, విద్యా శాఖలను నిర్వహించారు. 2025 ఫిబ్రవరిలో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించేంత వరకూ ఆ పదవులను ఆయన సమర్ధవంతంగా నిర్వహించారు.

## పులి జాడలతో జనం బెంబేలు

**అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన**




జనగామ,ఫిబ్రవరి4 పెద్దపులి సంచారం ఇప్పుడు మూడు జిల్లాల వాసులను భయాందోళనకు గురి చేస్తోంది. సిద్దిపేట, యాదాద్రి, జనగామ జిల్లాల సరిహద్దుల్లో తిరుగుతున్నట్లుగా గుర్తించారు. జనగామ మండలంలోని సిద్దెంకి, పెంబర్తి, పెద్దరాంచర్లలో పెద్దపులి సంచరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. యాద్రాది భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామ మీదుగా పెద్దపులి జనగామకు ప్రవేశించినట్లు రైతులు ఆటవీశాఖ, పోలీసులు సమాచారం అందించారు. దీంతో ఆధికారులు ఆయా గ్రామాలకు వెళ్లి పులి పాదముద్రలను సేకరించారు. వ్యవసాయ బావుల ప్రాంతాల్లో సంచరిస్తూ ఉండోచ్చని కావున వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. జగదేవ్‌పూర్ మండలం దౌలాపూర్ అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చిన పెద్దపులి వరుస గ్రామాల్లో సంచరిస్తూ ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. తాజాగా ఈ పులి యాదాద్రి భువనగిరి(జజీటజీటసతి ఃఠబీలజీనిజీణతిసతి) జిల్లా రాజపేట మండలం బసంతపూర్ సమీపంలో ఓ లేగదూడపై దాడి చేసి చంపేసినట్లు అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. పులి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు, తాజాగా జనగామ జిల్లా ఆలేరు మండలం శ్రీనివాసపురం గ్రామ పరిసరాల వైపు పులి వెళ్లినట్లు పాదముద్రల ఆధారంగా గుర్తించారు. ఘటనా స్థలాల్లో అటవీ శాఖ బృందాలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. పులి ప్రయాణించే మార్గాల్లో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. పులి సంచారం కారణంగా సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

## మోహన్‌బాబు వర్సిటీలో విద్యార్థి ఆత్మహత్య

**సమగ్ర విచారణకు సిఐటియు డిమాండ్**





తిరుపతి,ఫిబ్రవరి4 సినీనటుడు మోహన్ బాబు యూనివర్సిటీలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి బాలాజీ ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు నేతలు రుయా ఆసుపత్రికి వెళ్లి విద్యార్థి యువ నాయకులను పరామర్శించారు. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మురళి మాట్లాడుతూ గత కొంతకాలంగా విద్యార్థులు, తల్లిదండ్రుల పట్ల యూనివర్సిటీ యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో. ఓ విద్యార్థి మరణం పలు అనుమానాలను కలిగిస్తోందని అన్నారు. పోలీసులు నిష్పాక్షికంగా దర్యాప్తు జరిపి నిజా నిజాలు వెల్లడి చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తల్లిదండ్రులకు కడుపు శోకాన్ని మిగల్చకుండా రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని కందారపు మురళి ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## ఫోన్ బ్లాక్ చేయడంపై ఆగ్రహం

**ప్రియుడిని కిరాతకంగా చంపిన ప్రియురాలు**

రాయపూర్,ఫిబ్రవరి4 ప్రియుడు తన ఫోన్ నెంబర్ బ్లాక్ చేశాడన్న కోపంతో ఓ యువతి దారుణానికి ఒడిగట్టింది. ప్రియుడిని అతి కిరాతకంగా కత్తితో పొడిచి చంపేసింది. ఈ సంఘటన ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన పూర్తి వివరాల్లోకి వెళితే.. బిలాస్‌పూర్‌కు చెందిన 25 ఏళ్ల కమ్తా ప్రసాద్ సూర్య వంశీ హోటల్‌లో సర్వర్‌గా పని చేస్తున్నాడు. తన స్నేహితులతో కలిసి హోటల్‌కు దగ్గరలో ఇళు అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. ఆరు నెలల క్రితం అతడికి ఇన్‌స్టాగ్రామ్‌లో 22 ఏళ్ల రోషిణి సూర్యవంశీతో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్తా ప్రేమగా మారింది. కలిసి తిరిగే వారు.. ఫోన్‌లో గంటలు, గంటలు మాట్లాడుకునే వారు. అయితే, గత మూడు రోజుల నుంచి ప్రసాద్ వింతగా ప్రవర్తించటం మొదలెట్టాడు. రోషిణి ఫోన్ నెంబర్‌ను బ్లాక్ చేశాడు. దీంతో రోషిణి తీవ్ర ఆగ్రహానికి గురైంది. అతడు వేరే అమ్మాయితో తిరుగుతున్నాడేమోనన్న అనుమానం వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం కత్తి తీసుకుని ప్రసాద్ ఉండే ఇంటి దగ్గరకు వెళ్లింది. ప్రసాద్ తలుపు తెరవగానే అతడి మొబైల్ ఫోన్ ఇవ్వాలని డిమాండ్ చేసింది. అతడు ఇందుకు ఒప్పుకోలేదు. ఇద్దరి మధ్యా గొడవ మొదలైంది. కట్టలు తెంచుకున్న కోపంతో రోషిణి ప్రసాద్‌పై కత్తితో దాడి చేసింది. నేరుగా అతడి గుండెపై పొడిచింది. ప్రసాద్ గట్టిగా అరవటంతో లోపల ఉన్న ఫ్రెండ్ బయటకు వచ్చాడు. ప్రసాద్ నేలపై రక్తపు మడుగులో పడిపోయి ఉన్నాడు. ఆ ఫ్రెండ్ వెంటనే ప్రసాద్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లాడు. ప్రసాద్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు చనిపోయినట్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.నిందితురాలు రోషిణిని అరెస్ట్ చేశారు.

పోలీస్ అధికారి మాట్లాడుతూ.. 'ఆ యువతి మృతుడి ఇంటికి వచ్చింది. అతడి ఫోన్ ఇవ్వమని డిమాండ్ చేసింది. గొడవ సందర్భంగా కత్తితో అతడి గుండెపై పొడిచింది. అతడు అక్కడికక్కడే చనిపోయాడు' అని తెలిపారు. కాగా, బీజేపీ నాయకుడు, జిల్లా పంచాయత్ ప్రెసిడెంట్ రాజేష్ సూర్యవంశీకి ప్రసాద్ మేనల్లుడని తెలుస్తోంది.

# అవతార్ లెవల్లో వారణాసి మూవీ



పదిహేనేళ్ల క్రితం ప్లాన్ చేస్తే ఇప్పుడు కుదరింది ఈ సినిమాలో రాముడిగా మహేశ్ బాబు కనిపిస్తారుఅత్యద్భుత దృశ్యకావ్యంగా మూవీని విడుదల చేస్తున్నాంఅంతర్జాతీయ మీడియాతో రాజమౌళి, మహేశ్ బాబు రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న 'వారణాసి' ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతోంది. ఎన్నో రోజుల నుంచి అప్‌డేట్స్ కోసం ఎదురుచూసిన అభిమానులకు చాలా విశేషాలు వచ్చేశాయి. చిత్రబృందం ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 'వారణాసి' గురించి పంచుకుంది
. దీంతో ఈ చిత్రం ఒక్కసారిగా సోషల్‌మీడియాలో ట్రెండ్ అవుతోంది. రాముడిగా మహేశ్‌బాబు కనిపించనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇక రాజమౌళి ఈ సినిమా నిడివితో పాటు 'అవతార్'తో పోల్చడం గురించి మాట్లాడారు. నాకు ఉన్న కొన్ని కమిట్‌మెంట్‌ల కారణంగా మహేశ్‌బాబుతో సినిమా ఆలస్యం అయింది. లేదంటే 15 ఏళ్ల క్రితమే తీసేవాడిని. ఇప్పుడు వారణాసిని భారీ స్థాయిలో విడుదల చేస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా ఐమ్యాక్స్‌లలో సందడి చేయనుంది. నేను సినిమాలు ఆలస్యం చేస్తాననే చెడ్డపేరు ఉంది. ప్రొడక్షన్ పనులు లేట్ చేస్తానని వాయిదాలు వేస్తానని అంటారు. ఈ విషయంలో నెటిజన్లు కూడా చాలాసార్లు కామెంట్స్ చేశారు. 'వారణాసి' 3.20 గంటల నిడివితో విడుదలవుతుంది. ఇంత ఎక్కువ నిడివిలో మూడు నిమిషాలు ఆసక్తిగా లేకపోయినా వెంటనే ఆడియన్స్ ఫోన్ తీసుకుంటారు. మేం అందుకే చాలా జాగ్రత్తగా ఎక్కడా బోర్ కొట్టకుండా దీన్ని రూపొందిస్తున్నాం. ప్రేక్షకుడికి ప్రతి క్షణం ఆసక్తి కలిగేలా.. కొత్త అనుభవాన్ని ఇచ్చేలా దీన్ని తీర్చిదిద్దుతున్నాం అని రాజమౌళి తెలిపారు. హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టించిన ప్రపంచం 'అవతార్'తో రాజమౌళి 'వారణాసి'ని పోల్చడంపై ఆయన మాట్లాడారు. అలాంటి వ్యక్తితో పోల్చడాన్ని చాలా గౌరవంగా భావిస్తున్నా. కానీ, ఆయనతో నన్ను పోల్చొద్దు. ఆయన ఒక శిఖరం. ఆయన మాస్టర్. నేను ఇంకా విద్యార్థినే. 'వారణాసి'లో 25 నిమిషాలు పురాణాలపై చిత్రీకరించాం. ప్రేక్షకులు ఎప్పటికీ ఆ సన్నివేశాలను మర్చిపోలేరు. ప్రస్తుతం ఇంతవరకూ మాత్రమే చెప్పగలను అని దర్శకధీరుడు తెలిపారు.

## బైకర్‌లో రాజశేఖర్ పవర్‌ఫుల్ రోల్

ఒకప్పుడు టాలీవుడ్‌లో యాక్షన్ హీరోగా, యాంగ్రీ స్టార్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రాజశేఖర్ కొంతకాలం



విరామం తర్వాత మళ్లీ ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ఈసారి హీరోగా కాకుండా పవర్‌ఫుల్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించడంతో సినీ వర్గాల్లో ఆసక్తి
నెలకొంది. శర్వానంద్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'బైకర్' సినిమాలో రాజశేఖర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. బైక్ రేసింగ్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రం ఏప్రిల్ 3న విడుదలకు సిద్ధమవుతోంది.ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై మంచి అంచనాలు తీసుకురాగా, తాజాగా మేకర్స్ రాజశేఖర్ పాత్రకు సంబంధించిన 'బు÷-లలెట్ సునీల్' గ్లింప్స్ విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో రాజశేఖర్‌ను ఓ మాజీ పవర్‌ఫుల్ బైక్ రేసర్‌గా చూపిస్తూ స్టైలిష్ లుక్, గంభీరమైన ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. కొన్నేళ్ల తర్వాత ఆయనను ఇంత ఎనర్జిటిక్‌గా, మాస్ షేడ్ ఉన్న పాత్రలో చూడబోతున్నామనే సంకేతాలు ఈ వీడియో ఇచ్చింది.

## ఇక్కడ.. నాకు ఆ కష్టాలు తప్పలేదు


చిరుమూవీలో సారా అర్జున్ ?

మన శంకర వరప్రసాద్ సినిమాతో మెగాస్టార్ చిరంజీవి బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. ఈ సినిమా అనంతరం సమ్మర్‌లో అతడి విశ్వంభర చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమా తర్వాత బాబీతో మెగా 158 సినిమా చేయబోతున్నాడు చిరు. ఈ ప్రాజెక్ట్ గురించి ఒక ఆసక్తికరమైన వార్త ఫిలిం నగర్ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రంలో చిరంజీవి కుమార్తెగా ఒక కీలక పాత్ర కోసం 'పొన్నియిన్ సెల్వన్' ఫేమ్, ధురంధర్ సినిమా సారా అర్జున్ పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ పాత్ర సినిమాలో అత్యంత కీలకం కానుందని తెలుస్తుంది. అయితే దీనిగురించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుంది. మరోవైపు చిరంజీవి కెరీర్‌లో ఇదొక ప్రత్యేకమైన మూవీగా నిలిచిపోతుందని మెగా అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా కన్నడ నిర్మాణ సంస్థ కేవిఎన్ ప్రొడక్షన్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది.



## తక్షకుడిగా వస్తున్న ఆనంద్ దేవరకొండ

యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త యాక్షన్ థ్రిల్లర్ 'తక్షకుడు'. గతంలో 'మిడిల్ క్లాస్ మెలోడీస్' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాన్ని అందించిన దర్శకుడు వినోద్ అనంతోజు, ఆనంద్ దేవరకొండ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా టీజర్‌ను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది. టీజర్ చూస్తుంటే ఇది పక్కా రివెంజ్ డ్రామాగా కనిపిస్తోంది. పెళ్లయిన రోజే తన కుటుంబాన్ని కోల్పోయి, తీవ్ర గాయాలతో అడవిలో పడి ఉన్న యువకుడిని స్థానికులు కాపాడటం, ఆ తర్వాత తన పతనానికి కారణమైన వారిపై అతను తీర్చుకునే ప్రతీకారమే ఈ చిత్ర కథాంశమని అర్థమవుతోంది. ఈ సినిమాలో ఆనంద్ దేవరకొండ మునుపెన్నడూ లేని విధంగా చాలా ఇంటెన్స్ మరియు సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన డైలాగ్ డెలివరీ, బాడీ లాంగ్వేజ్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తున్నాయి. ఇక 'లాపతా లేడీస్' ఫేమ్ నితాన్షీ గోయల్ ఈ చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అవుతుండగా, కాలకేయ ప్రభాకర్ కీలకమైన నెగటివ్ రోల్‌లో నటిస్తున్నారు. సితార ఎంట్టంల్గ÷న్మెంట్స్ నిర్మించిన ఈ చిత్రం నేరుగా నెట్‌ఫ్లిక్స్‌లో తెలుగుతో పాటు ప్రధాన భారతీయ భాషల్లో విడుదల కానుంది. ప్రస్తుతం ఈ టీజర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను పెంచుతోంది.








## బోర్డర్-2 నుంచి ఘర్ కబ్ ఆవోగే సాంగ్ విడుదల

బాలీవుడ్ క్లాసిక్ వార్ డ్రామా 'బోర్డర్' చిత్రానికి సీక్వెల్‌గా వచ్చిన 'బోర్డర్ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘనవిజయాన్ని సాధించి సంచలనం సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో సినిమాలోని ఎమోషనల్ సాంగ్ 'ఘర్ కబ్ ఆవోగే పూర్తి స్థాయి వీడియోను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. 1997 నాటి ఐకానిక్ పాటను పునర్నిర్మించిన ఈ వెర్షన్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ పాటను ఒరిజినల్ గాయకులు సోనూ నిగమ్, రూప్ కుమార్ రాథోడ్‌లతో కలిసి నేటి తరం గాయకులు అర్జిత్ సింగ్, విశాల్ మిశ్రా, దిల్జీత్ దోసాంజ్ అద్భుతంగా ఆలపించారు. అను మాలిక్ స్వరపరిచిన ఒరిజినల్ ట్యూన్‌కు సంగీత దర్శకుడు మిథూన్ సరికొత్త హంగులు అద్దారు. దాదాపు 10 నిమిషాల నిడివి గల ఈ వీడియో సాంగ్‌లో సన్నీ డియోల్, వరుణ్ ధావన్, దిల్జీత్ దోసాంజ్ మరియు అహన్ శెట్టి సైనికుల భావోద్వేగాలను, వారి త్యాగాలను కళ్ళకు కట్టినట్లు చూపించారు. 1971 భారత్-పాక్ యుద్ధ నేపథ్యంలో అనురాగ్ సింగ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం జనవరి 23, 2026న విడుదలై ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

## వారణాసి' సింగిల్ మూవీ.. రూమర్స్‌కు జక్కన్న చెక్!



రాజమౌళి దర్శకత్వంలో రూపొందే ఏ సినిమాకైనా పబ్లిసిటీతో అవసరం లేకుండా బజ్ క్రియేట్ అవుతూనే ఉంటుంది. అయితే ఈ సారి ఇంటర్నేషనల్ ఎరీనాను టార్గెట్ చేస్తూ రాజమౌళి మహేశ్‌బాబు (మీుష్టవంష్త్ర దీుఎబ)తో వారణాసి (ఋతీుఋుంఱ) చిత్రం రూపొందిస్తున్నారు. ఈ సినిమాను 2027 ఏప్రిల్ 7న విడుదల చేస్తామని ప్రకటించారు. హాలీవుడ్ జనం ముందుగానే తమ సినిమాల రిలీజ్ డేట్ చెప్పేసి, తరువాత సదరు చిత్రాలకు సంబంధించిన విశేషాలను విడుదల చేస్తూ ఉంటారు. అలాగే ఇప్పుడు 'వారణాసి' సినిమా అంటార్కిటికాలో షూటింగ్ కు ముస్తాబవుతూ ఉన్న విషయాన్ని తెలిపారు. అక్కడ షూటింగ్ జరుపుకుంటున్న తొలి ఇండియన్ మూవీగా 'వారణాసి' నిలవనుంది. ఈ చిత్రంపై జనాలు మాత్రం పలు కథలు చెప్పుకుంటున్నారు. 'బాహుబలి' సిరీస్ లాగే 'వారణాసి' కూడా రెండుభాగాలుగా రానుందని విశేషంగా వినిపిస్తోంది. అయితే రాజమౌళి ఈ అంశంపై క్లారిటీ ఇస్తూ- 'వారణాసి' సింగిల్ సినిమాగానే జనం ముందుకు వస్తుందని తెలిపారు. ఈ సినిమా రన్ టైమ్ మూడు గంటల ఇరవై నిమిషాలు ఉంటుందనీ సమాచారం.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com